ఆంధ్రజ్యోతి 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 27, అక్టోబరు 2025

- యంత్రాంగం అప్రమత్తం
- అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష
- బీచ్‌ల వద్దకు ప్రజలు రాకుండా నిషేధం
- పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో గస్తీ
- ఒడ్డుకు చేరిన పడవలు
- ఒంగోలుకు చేరిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం
- ఇప్పటికే కురిసిన వర్షాలతో నీటిలోనే పంటలు
- పశ్చిమాన దెబ్బతింటున్న వైనం
- మళ్లీ వర్షం కురిస్తే పూర్తిగా నష్టపోతామని రైతుల ఆందోళన
- పాఠశాలలకు నేటి నుంచి 29వ తేదీ వరకు సెలవులు



కొత్తపట్నం తీరంలో ఒడ్డుకు చేర్చిన పడవలు, ముందుకొచ్చిన సముద్రం

మొంథా ముప్పు

నేడు, రేపు భారీ వర్షాలు.. జిల్లాకు రెడ్ అలర్ట్

ఒంగోలు/కొత్తపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తుఫాన్‌గా మారనుంది. మంగళవారం రాత్రికి కాకినాడ ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు విపత్తుల నివారణ శాఖ హెచ్చరించింది. దాని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాన్ తీవ్రత అధికంగానే ఉండొచ్చన్న సంకేతాలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు ఇచ్చారు. వాతావరణ శాఖ ఏప్రాంతంలో ఎలాంటి పరిస్థితి ఉండవచ్చన్న దానిపై స్పష్టత ఇచ్చింది. ఆ ప్రకారం సోమ, మంగళవారాలు జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. తుఫాన్ ప్రత్యేక అధికారిగా నియమితులైన కోన శశిధర్ ఆదివారం సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను, భారీ వర్షాలు కురిస్తే ఎదుర్కొనేందుకు ప్రణాళికలను కలెక్టర్ రాజాబాబు నేతృత్వంలో అధికారులు వివరించారు. మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నిమితులైన జిల్లా అధికారులంతా ఎక్కడికక్కడ స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేకించి తీర ప్రాంతంలోని మండలాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తుఫాన్ హెచ్చరికలపై ఊరూరా ప్రచారం నిర్వహించారు.



సమీక్షలో ప్రత్యేకాధికారి శశిధర్, కలెక్టర్ రాజాబాబు

అల్లకల్లోలంగా సముద్రం

తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలతోపాటు 60-80 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారమే సముద్రం అల్లకల్లోలంగా కనిపించింది. అలలు ఎగసి పడుతున్నాయి. సాధారణం కంటే కొంత ముందుకు వస్తున్నాయి. సోమవారం నాటికి జిల్లాలోని పలు తీర ప్రాంతాల్లో సముద్రం ఇంకా ముందుకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఒడ్డుకు చేరిన పడవలు

మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించటంతో అధికారుల సూచన మేరకు జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత అనుభవాల దృష్ట్యా పడవలను, వలలను తీరానికి దూరంగా చేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. అలలు తీరం దాటి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో గతం కంటే దూరంలో మెరక ప్రాంతాలకు చేర్చుకుంటున్నారు.

నిత్యావసరాలు.. పునరావాస కేంద్రాలు సిద్ధం

తుఫాన్ ప్రభావం మూడురోజులు కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులు నిత్యావసర సరుకులను సిద్ధంగా ఉంచారు. ప్రత్యేక కోటా కింద బియ్యాన్ని అన్ని తీరప్రాంత మండలాల రేషన్ దుకాణాలకు తరలించారు. కొత్తపట్నం మండలంలోని తుఫాన్ షెల్టర్లను అధికారులు ఆదివారం పరిశీలించారు. వాటికి విద్యుత్ సరఫరా, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సమీప స్కూళ్లను కూడా పునరావాస కేంద్రాలుగా మార్చారు.

ఇటీవల వర్షాల నుంచి తేరుకోని ప్రజలు

ఇటీవల అల్పపీడన ప్రభావంతో నాలుగురోజులపాటు కురిసిన వర్షాల ప్రభావం నుంచి జిల్లా ప్రజానీకం ఇంకా తేరుకోలేదు. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చెరువులు నిండిపోయాయి. గుండ్లకమ్మకు 6,700 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తుండగా రెండు గేట్లు ఎత్తి 7000 క్యూసెక్కులు దిగువకు వదలుతున్నారు. పశ్చిమప్రాంతంలో ఇంకా వేలాది ఎకరాల్లో పంటలు నీటిలోనే ఉండగా వాటిని రక్షించుకొనే ప్రయత్నంలో రైతులు ఉన్నారు. ఈనేపథ్యంలో తుఫాన్ హెచ్చరికతో వారు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల ముందస్తు జాగ్రత్తలు

భారీ వర్షాలు కురిస్తే ఎదురయ్యే ఇబ్బందులను అంచనా వేసి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సహాయక చర్యల కోసం ప్రభుత్వ ఆదేశాలతో 27 మందితో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఒంగోలు చేరింది. పలుచోట్ల బోట్లు, ఎక్స్‌కవేటర్లు, ఆహారం, నీరు ఇతరత్రా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 27నుంచి 29 వరకు మూడు రోజులపాటు జిల్లాలో పాఠశాలలకు కలెక్టర్ రాజాబాబు సెలవులు ప్రకటించారు.

జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉంది. దాని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆమేరకు విపత్తుల నివారణ శాఖ నుంచి సమాచారం అందింది. ఆ రెండు రోజులు జిల్లాకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి కోన శశిధర్ ఒంగోలు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సహాయక చర్యల కోసం 27 మందితో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఒంగోలుకు చేరింది. ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు జిల్లాలో పాఠశాలలకు కలెక్టర్ రాజాబాబు సెలవులు ప్రకటించారు. మరోవైపు ఆదివారం నుంచే సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగసి పడుతున్నాయి. మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తగా పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. అధికారులు జిల్లాలోని బీచ్‌ల వద్ద నిషేధాజ్ఞలు విధించారు. తీరప్రాంతాలకు ఎవ్వరూ చేరుకోకుండా గ్రామాల వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

సముద్ర స్నానాలు నిషేధం

ముందస్తు జాగ్రత్తగా సముద్రతీరంలో బీచ్‌లకు ప్రజలు రాకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో సోమవారం పవిత్ర స్నానాలకు పెద్ద సంఖ్యలో కనపర్తి, కొత్తపట్నం, ఈతముక్కల, పాకల తీరప్రాంతాలకు ప్రజలు వస్తారు. తుఫాన్ నేపథ్యంలో సముద్ర స్నానాలకు ఎవ్వరూ రావొద్దని అధికారులు హెచ్చరికలు చేయడమే కాక తీరప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ సిబ్బందితో గస్తీని కూడా ఏర్పాటు చేశారు. తీరం వద్దకు ఎవ్వరూ వెళ్లకుండా అడ్డంగా తాళ్లు కట్టారు. కొన్నిచోట్ల రోడ్లను బ్లాక్ చేశారు. మెరైన పోలీసు స్టేషన్ కొత్తపట్నంలో ఉంది. ఇక్కడి నుంచే జిల్లావ్యాప్తంగా తీరంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారం అందజేస్తున్నారు. మత్స్యకారులు ఎవ్వరూ సముద్రంలోకి వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



కొత్తపట్నం తీరంలో కార్తీక స్నానాలకు ప్రజలు రాకుండా తాడు కట్టిన పోలీసులు

నేడు 'మీ కోసం' రద్దు



కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)ను మొంథా తుఫాన్ కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఒంగోలుకు రావద్దని కోరారు.

పోలీసు గ్రీవెన్స్ కూడా...

ఒంగోలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా సోమవారం జరగాల్సిన పోలీస్ గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా ఈనెల సోమవారం నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షలతోపాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రీవెన్స్‌ను రద్దు చేసినందున సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తన కార్యాలయానికి రావద్దు అని కోరారు.

మహిళను వివస్త్రను చేసి..

- అనుచరులతో కలిసి మరో మహిళ దాష్టీకం
- ఇద్దరూ ఒకే వ్యక్తిని ఇష్టపడటమే కారణం
- ఒంగోలులో ఘటన

మెయిన్‌లో...

బాలికపై తండ్రి లైంగిక దాడి

- ఆరోగ్యం బాగులేకపోవడంతో రిమ్స్‌లో చేరిక
- అసలు విషయం తెలియడంతో కొండపి పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు

మెయిన్‌లో...

ఆగని భూ అక్రమాలు

- కనిగిరిలో ఇష్టానుసారం ఆన్‌లైన్
- ఇప్పటికే తహసీల్దార్ సస్పెన్షన్
- త్వరలో మరో నలుగురు వీఆర్వోలపై పడనున్న వేటు

7

కదిలిన రవాణా శాఖ

- జిల్లా వ్యాప్తంగా బస్సుల తనిఖీలు
- 34 కేసుల నమోదు
- రూ.89,810 జరిమానా

ఒంగోలు క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో నిబంధనలు పాటించని బస్సులపై 34 కేసులు నమోదు చేశారు. అందుకు సంబంధించి రూ.89,810 జరిమానా విధించారు. ఎక్కువ బస్సుల్లో ప్రయాణికుల లిస్టు, మంటలు ఆర్పే పరికరాలు లేనట్లు గుర్తించారు. ప్రైవేటు ట్రావెల్స్ యజమానులతో కూడా రవాణా శాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. బస్సుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్ చలానాలు ఉండి బస్సులు రోడ్లపై తిరుగుతుంటే నిలిపివేస్తామని స్పష్టం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని డీటీసీ ఆర్.సుశీల తెలిపారు.



దర్శిలో ట్రావెల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

తప్పిన పెను ప్రమాదం..!

- రైల్వే ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం
- ట్రైన్ దగ్గరకు చేరుకున్నాక గేటు ఎత్తిన వైనం
- ట్రాక్‌పైకి వచ్చిన వాహనదారులు
- కొందరు కేకలు వేయడంతో అప్రమత్తం



ఒంగోలు నగర పరిధిలోని అగ్రహారం రైల్వే గేటు వద్ద ట్రాక్ మధ్యలో ఆగిపోయిన వాహనదారులు

ఒంగోలులో అగ్రహారం వెళ్లే మార్గంలోని రైల్వే గేటు వద్ద పెనుప్రమాదం తప్పింది. అటు స్టేషన్ మాస్టర్, ఇటు గేట్‌మన్ మధ్య సమన్వయ లోపంతో వాహనదారులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై నుంచి హౌరా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం ఉదయం 10:55 గంటలకు ఒంగోలు రైల్వే స్టేషన్‌లో ఆగాల్సి ఉంది. రైలు స్టేషన్ సమీపంలోని అగ్రహారం వెళ్లే మార్గంలో ఉన్న గేటు వద్దకు సమీపించే సమయంలో గేట్‌మన్ గేటు ఎత్తారు. దీంతో వాహనదారులు ట్రాక్‌పై నుంచి వెళ్లడం ప్రారంభించారు. కొద్ది దూరంలోనే ట్రైన్ వస్తుండటాన్ని గుర్తించి పలువురు పెద్దగా కేకలు వేయడంతో గేట్‌మన్ హడావుడిగా మళ్లీ గేటు వేశారు. కొందరు వాహనదారులు ట్రాక్‌కు, గేటుకు మధ్యలో ఆగిపోయారు. లోకో పైలట్ అప్రమత్తమై ట్రైన్ వేగాన్ని తగ్గించడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్టేషన్ మాస్టర్, గేట్‌మన్ మధ్య సమన్వయ లోపం వల్లనే ఇలాంటి పరిస్థితి ఎదురైందని పలువురు రైల్వే అధికారులు వెల్లడిస్తున్నారు.

-ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

షురూ..!

కొత్త జిల్లాలకు ముహూర్తం ఖరారు

- మార్కాపురం, కందుకూరు, అద్దంకిపై ఇచ్చిన హామీకి అనుగుణంగా ముందుకు
- రేపు మంత్రివర్గ సబ్‌కమిటీతో సీఎం సమావేశం
- 7న చంద్రబాబు తుది నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాల పునర్వ్యవస్థీకరణను పూర్తిచేసే ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం వేగవంతం చేసింది. వచ్చే జనవరి నాటికే ప్రకటించాలని నిర్ణయించుకున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగా ఈ అంశంపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం సమావేశం కాబోతున్నారు. వచ్చేనెల 7వ తేదీ జరగనున్న రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో ఈ విషయంపై సమీక్షించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

గత సాధారణ ఎన్నికలకు ముందు చంద్రబాబుతోపాటు ముఖ్యనేతలు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల అమలుతో ముందున్నామని ప్రకటించుకున్న రాష్ట్రప్రభుత్వం ఈ విషయంలోనూ మరో ముందడుగు వేసి జనవరి నాటికి హామీని పూర్తిచేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. అంతేగాక కులగణన ప్రారంభానికి ముందే జిల్లాల పునర్వ్యవస్థీకరణ విషయంలో సాంకేతికంగా ముందుకు పోవాల్సిన అవసరం ఏర్పడిందని కూడా అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల సీసీఎల్ఏ ఉన్నతాధికారులు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాలు, జిల్లా మార్పులపై నివేదిక పంపాలని కోరిన విషయం విదితమే. ఉమ్మడి ప్రకాశంకు సంబంధించి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుతోపాటు నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును, బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి నియోజకవర్గాలను ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశంలో కలిపేందుకు అవసరమైన ప్రతిపాదనలు తీసుకున్నారు.

మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రెడీ

రాష్ట్రమంత్రివర్గ ఉపసంఘం కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాల చేర్పులు, మార్పులపై ఇప్పటికే ఒక నివేదికను రూపొందించింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సమాచార శాఖ మంత్రి పార్థసారథి, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ తదితర మంత్రులతో సబ్‌కమిటీని గతంలోనే ముఖ్యమంత్రి నియమించారు. వారు ఆయా ప్రతిపాదనలపై పరిశీలన చేసి నివేదికను తయారు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా విషయానికొస్తే ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ తదితరులు ఇచ్చిన హామీలను కూడా దృష్టిలో ఉంచుకుని ఒక నివేదికను తయారు చేశారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు.. అందులో మార్కాపురం, వై.పాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాలను కలపాలని ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. ఇటీవల మార్కాపురం ప్రాంతంలో కొందరు నాయకులు లేవనెత్తిన శ్రీశైలం మండలాన్ని మార్కాపురంలో చేర్చాలనే అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం తోసిపుచ్చినట్లు తెలిసింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం జిల్లా ఏర్పాటే ముఖ్యమని వివాదాల్లోకి వెళ్లి సమస్యను పక్కదారి పట్టించటం సమంజసం కాదని మంత్రివర్గ ఉపసంఘం కూడా భావించినట్లు సమాచారం. ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక కీలకమంత్రి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఈ ఐదు నియోజకవర్గాలతోనే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం తమ పరిశీలనలో కూడా అదే సమంజసమని నిర్ధారణ అయిందన్నారు. తదనుగుణంగానే ముందుకు పోతున్నామని తెలిపారు.

కందుకూరు, అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గాలను ఒంగోలు కేంద్రంగా ప్రకాశం జిల్లాలో కలపటం కూడా సమంజసమని గుర్తించినట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి మంగళవారం సమావేశానికి ఆహ్వానించినందున తమ నివేదికను ఆయనకు సమర్పిస్తామన్నారు. తుది నిర్ణయం ఆయన అభిప్రాయానికి అనుగుణంగా మంత్రివర్గ సమావేశంలో తీసుకునే అవకాశం ఉందని కూడా తెలిపారు. రాష్ట్రమంత్రివర్గ సమావేశం 7వ తేదీ జరగనుండటం, ఇప్పటికే మంత్రివర్గ సబ్‌కమిటీ నివేదిక తయారవటంతోపాటు జిల్లాల కలెక్టర్ల నుంచి కూడా ప్రత్యేక నివేదికలను ఉన్నతాధికారులు తెప్పించుకున్నందున మంగళవారం ముఖ్యమంత్రి నిర్వహించే సమీక్ష, ఆ తర్వాత జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంలో పూర్తిస్పష్టత అధికారికంగా రావచ్చని భావిస్తున్నారు.



మంత్రి స్వామిని కలిసిన న్యాయవాదులు

● కోర్టు ఏర్పాటుకు సహకరించినందుకు కృతజ్ఞతలు



న్యాయవాదులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ఏర్పాటుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బక్కమంతుల వెంకటేశ్వర్లు న్యాయవాదులు సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, హరి కోటేశ్వరరావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు, బ్యాటరీ సైకిళ్లు అందజేయాలని వినతి

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, అర్హత కలిగిన వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని మండల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంత్రి స్వామికి వినతిపత్రం అందజేశారు. వారి అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

8న దర్శిలో సీఐటీయూ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దర్శిలో వచ్చేనెల 8,9 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు జరుగుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిలో సీఐటీయూ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జీవీ.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, కల్పన, చీకటి శ్రీనివాసరావు, టి.మహేష్, పి.ఆంజనేయులు, బంకా సుబ్బారావు, టి.రాము ఆవులయ్య, పారా శ్రీనివాసరావు, సీహెచ్.చిరంజీవి, జీవీ.రాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో అధికారులతో సమీక్ష



పెద్దగచ్చుల బ్రిడ్జిపై గోతిని పరిశీలిస్తున్న పీడీ శ్రీహరి

సంతనూతలపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీహరి మండల అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కర్నూల్‌రోడ్డుపై పెద్దగచ్చుల బ్రిడ్జి వద్ద ఏర్పడిన పెద్ద గోతిని పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి, ఏఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ



డాక్టర్ జవహర్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చీమకుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని వృద్ధాశ్రమానికి ప్రముఖ వైద్యుడు బందా జవహర్, మాధవి దంపతులు వితరణ చేశారు. ఆదివారం వృద్ధాశ్రమాన్ని సందర్శించిన వారు రూ.68వేలను అందజేశారు. ఈ సందర్భంగా జవహర్ దంపతులను ఆశ్రమ నిర్వాహకులు ఎస్‌కే.బాసా ఘనంగా సత్కరించారు.

ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా చూడాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీవో రాజశేఖరరావు ఆదేశించారు. ఆదివారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష చేశారు. అధికారులు శ్రీనివాసరావు, యు.శేషుబాబు, రామ్‌కుమార్, నాగేశ్వరరావు, డాక్టర్ సుందరప్రసాద్ పాల్గొన్నారు.

'మొంథా'ను సమర్థవంతంగా ఎదుర్కొందాం

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



ఎన్‌జీపాడులో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్



ఒంగోలులో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నాగులుప్పలపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే వాగులు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యచరణతో పనిచేయాలని సూచించారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని, ఏదైనా సమస్యలు ఎదురైతే మండల కార్యాలయంలోని కంట్రోల్ రూంకి తెలియజేయాలని సూచించారు. అధికారులు విధులు నిర్వహించే చోటనే బస ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు వెనుకాడేది లేదని పీడీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ రజియాసుల్తానా, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి : కమిషనర్

ఒంగోలు(రూరల్): ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని నగర కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజల నుంచి సమస్యలతో కూడిన సమాచారం అందుతోందని, కానీ ఉద్యోగుల నుంచి ఎలాంటి సమాచారం రావటం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఒంగోలులోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తుపాన్ ప్రభావంపై ముందస్తుగా కార్పొరేషన్, మండల అధికారులు, వీఆర్వోలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో 100 కిలోమీటర్లకు వేగంతో వీచే ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అందువల్ల శిథిలావస్థ భవనాలు, గృహాలు, పూరిళ్లలో నివసించే వారికి ముందస్తుగా తెలిపి నోటీసులు ఇవ్వాన్నారు. అలాంటి గృహాల్లో నివాసం లేకుండా చేయాలని చెప్పారు. నగరంలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిండా నీరు నింపాలన్నారు. నగరంలో మంచినీటి సరఫరాకు 42 ట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నాయని, విద్యుత్‌పై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వృక్షాలు పడిపోతే వాటిని తొలగించటానికి అవసరమైన సామగ్రిని అందుబాటులో పెట్టుకోవాలని ఆయన ఆదేశించారు. ఉద్యోగులకు ఎలాంటి సెలవులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ మధుసూదనరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస్‌సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పొన్నలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి సీహెచ్ సువార్త అధ్యక్షతన మంతా తుఫాన్‌పై ముందస్తు సమీక్ష నిర్వహించారు. సువార్త మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, రక్షణ కేంద్రాల వద్ద పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని, అత్యవసరంగా సంప్రదించడానికి ఫోన్ నెంబర్లు అందరికీ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ అధికారులు అందరూ తుఫాన్ నివారణ చర్యలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం స్రవంతి, ఎస్సై అనూక్, ఆర్ఐ శివ పాల్గొన్నారు.

కొండపిలో...

కొండపి: మొంథా తుఫాన్ బలపడనున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు ఆదివారం సమావేశమై తుఫాన్ సహాయక చర్యలపై సిబ్బందితో సమీక్షించారు. కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై ప్రేమ్‌కుమార్ అధికారులతో సమీక్షించారు.

జరుగుమల్లిలో...

జరుగుమల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో రమణమూర్తి, తహసీల్దార్ మురళి సమావేశమై సిబ్బందితో సమీక్షించారు. ఆయా శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

చీమకుర్తి: మొంథా తుఫాన్ తీవ్రతను గమనించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మైన్స్ డీడీ రాజశేఖర్ కోరారు. ఆదివారం చీమకుర్తిలో మండల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేసి ఉద్యోగులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తదుపరి పునరావస కేంద్రాలను పరిశీలించారు. మండలపరిధిలో ప్రమాదకరంగా ఉన్న వాగులను పరిశీలించి తగు జాగ్రత్తలను సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, కమిషనర్ రామకృష్ణయ్య, ఎంఈవో నరసింహారావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దు : సీఐ



గజ ఈతగాళ్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు: మొంథా తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు సూచించారు. ఆదివారం కనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని మత్యకారులతో సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా సమావేశం నిర్వహించారు. సముద్రతీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం మత్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లడానికి అనుమతి లేదని చెప్పారు. ఎవరైనా వేటకు వెళ్లిఉంటే వెంటనే వారిని తిరిగి రావాలని సూచించారు. తీర ప్రాంత పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కనపర్తిలోని జడ్పీ హైస్కూల్‌లో వైర్‌లెస్ సెట్‌ను ఏర్పాటు చేశామని, ఇది జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానంగా పనిచేస్తుందని చెప్పారు. గజ ఈతగాళ్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్తీక సోమవారం దృష్ట్యా భక్తులు సముద్రస్నానాలు ఆచరించేందుకు రావద్దని సీఐ కోరారు. అత్యవసరమైతే 9121102130, 9121102134 సెల్ నంబర్లకు తెలియపరచాలని కోరారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్దిపాడులో సమీక్ష

మద్దిపాడు: మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో కార్తీక వన సమారాధన జరిగింది. ముందుగా నందీశ్వరునికి నగరోత్సవం, అనంతరం సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. సంఘం అధ్యక్షుడు దంపూరి సాయిరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థులకు నగదు బహుమతులు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జంగమ కుల వృత్తిదారులకు నెలకు కనీసం రూ.10 వేల గౌరవ వేతనం అందించాలని, శ్రీశైలంలో సత్ర నిర్మాణానికి స్థలం కేటాయించాలని, శివాలయాల్లో అర్చకులుగా జంగమ దేవరలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునునూరి కోటేశ్వరరావు, పరవళ్ల రాచయ్య, దోగిపర్తి సుబ్బారావు, నాగండ్ల సుబ్రహ్మణ్యం, దోగిపర్తి సురేష్, వీరసాయి బాబు, యల్లసిరి మల్లికార్జున, చేజెర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివారుకాలనీలను పట్టించుకోని యంత్రాంగం

● సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని శివారు కాలనీలు భారీవర్షాలతో మునిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నగన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. సీపీఎం ప్రతినిధి బృందం ఆదివారం నగరంలోని గోపాలనగరం, భగత్‌సింగ్‌కాలనీ, కేశవరాజుకుంట, ఉదయంకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శివారు కాలనీల్లో రోడ్లు ధ్వంసం కావడంతో వర్షపు నీరునిల్వ అయ్యి దోమలు పెరిగాయన్నారు. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. నగరంలో ప్రధాన వీధుల్లో ఆర్భాటంగా రంగులతో రోడ్లు వేస్తున్నారే తప్ప శివారుకాలనీల్లో మాత్రం మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు కాలనీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని సమక్షంలో ప్రజలను ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీతారామకృష్ణ, వంశీధరక్, బి.భవన్నారాయణ, కె.సత్యవతి, జి.సత్యవతి, కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్‌గా నేడు జయంత్‌బాబు ప్రమాణస్వీకారం

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్‌గా మండవ జయంత్‌బాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. సోమవారం ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని పొగాకు సమాఖ్య కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ముఖ్యఅతిథులుగా సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సమాఖ్య ఎండీ సురేంద్రబాబు, సీఈవో జి.హరనాథ్ హాజరుకానున్నారు.

దొడ్డవరం రేషన్ డీలర్‌పై దాడి

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామంలో రేషన్ డీలర్ కొత్తా సుమన్‌పై దాడి జరిగింది. ఆదివారం గ్రామంలో డీలర్ స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తుండగా సర్పంచ్ పూనూరు సుబ్బారావు కలుగజేసుకున్నారు. ఎవరి అనుమతులతో గ్రామంలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నావంటూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో సర్పంచ్, డీలర్ వద్ద ఉన్న ఈపోస్ మిషన్ లాక్కోని అడ్డగించి దాడికి పాల్పడ్డారు. ఈమేరకు బాధితుడు సుమన్ మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటసైదులు కేసు నమోదు చేశారు. కాగా సర్పంచ్ సుబ్బారావు కూడా ఫిర్యాదు చేశారు.

గుండ్లకమ్మకు తగ్గిన వరద ఉధృతి

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు ఆదివారం వరద ఉధృతి తగ్గింది. దీంతో ప్రాజెక్టు అధికారులు రెండు డ్యామ్ గేట్ల ద్వారా నీటికి కిందకు వదులుతున్నారు. ఎగువ నుంచి 6700వేల క్యూసెక్కులు నీరు వస్తుండగా, దిగువకు రెండు గేట్ల ద్వారా 7000 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. కాగా ప్రాజెక్టులో 23.9 మీటర్ల వద్ద నీటిని స్థిరీకరణ చేసినట్లు ఆయన చెప్పారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న సూర్యకల్యాణ్ చక్రవర్తి, శెగ్గం శ్రీనివాసులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం దేశ ప్రజలకు ప్రేరణనిచ్చే అనేక అంశాలు స్పష్టంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడారు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, కాకర్ల నరసింహారావు, భ్రమరాంబ, రవిశంకర్, శీలం వెంకటేశ్వరరెడ్డి, భూపతికృష్ణ, దుర్గ, నాగలక్ష్మి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో కాపునాడు స్వర్ణోత్సవాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాపునాడు స్వర్ణోత్సవ సమావేశం నవంబరు 30వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు గాండ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఒంగోలులో కాపునాడు ప్రాంతీయ సదస్సు జిల్లా అధ్యక్షుడు బండారు మహేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మాజరైన సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కాపునాడు ఆవిర్భవించి 50 ఏళ్ళు పూర్తయినందున విజయవాడలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కాపులందరనూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపునాడు నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుంటలో పడి పశువుల కాపరి మృతి

టంగుటూరు (కొండపి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశువుల ఆచూకీ కోసం వెళ్లి వెదుకుతూ ప్రమాదవశాత్తు నీటి కుంటలోపడి పశువుల కాపరి మరణించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి సుందరయ్య తన గేదెల కోసం వెదికేందుకు వెళ్లి అనంతవరం గ్రామ సమీపంలోని కుంటలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మరణించాడు. మృతుని అన్న వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

వైద్యకళాశాలలు ప్రైవేటుపరం అన్యాయం : మేరుగ

నాగులుప్పలపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పరం చేయడం అన్యాయమని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున విమర్శించారు. ఆదివారం రాత్రి పోతవరంలో రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ అంజమ్మ, సర్పంచ్ రేణుక, బ్రహ్మనందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీమన్నారాయ, నలమలపు కృష్ణారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

కొండపి మండలంలోని వెన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ముప్పరాజుకుంట విస్తీర్ణం య. 11.06 సెంట్లలోని చిల్లచెట్లు కొట్టుకుని తీసుకోవడానికి 5.11.2025వ తేదీన ఉదయం 11 గంటలకు ఉన్నతాధికారుల అనుమతితో వెన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట జరుగును. ఆసక్తిగలవారు కార్యాలయం పనిదినాలలో సంప్రదించగలరు.

సం/- పంచాయతీ కార్యదర్శి
వెన్నూరు గ్రామం
సెల్ నంబరు: 8096944039



నేడు సముద్ర స్నానం నిషేధం : డీఎస్పీ



కొత్తపట్నం బీచ్‌లో బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కార్తీక సోమవారం సముద్ర స్నానాల కోసం రాకపోకలను నిషేధించినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. జిల్లాలో తీరప్రాంతాలైన కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల, ఊళ్ళపాలెం, కనపర్తి సముద్ర తీరంలో స్నానం చేసేందుకు ఎవరూ రావద్దని కోరారు. తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో సముద్ర స్నానం తాత్కాలికంగా నిషేధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు కూడా టీవల కురిసిన వర్షాలతో నిండి ఉన్నాయని, చెరువులలో కూడ దిగేందుకు ప్రయత్నం చేయవద్దని ఆయన కోరారు. భక్తులు పోలీసు విజ్ఞప్తిని గమనించి జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పాకల, ఊళ్లపాలెంలో..

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్రతీరంలో మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం కార్తీక పవిత్ర స్నానాలను రద్దుచేస్తున్నట్లు తహసీల్దార్ రాజేష్ తెలిపారు. భక్తులు సముద్ర స్నానాలు ఆచరించడానికి రావొద్దని తెలిపారు.

గుండ్లకమ్మలో స్నానాలు రద్దు

మద్దిపాడు: కార్తీకమాసంలో గుండ్లకమ్మ ప్రాజెక్టులో స్నానాలు చేసేందుకు భక్తులకు పోలీస్ అనుమతి లేదని ఎస్ఐ వెంకటసైదులు ఆదివారం తెలిపారు. వర్షాల కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టులో నీరు చేరడం వల్ల స్నానాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడికి రిమాండ్

సంతనూతలపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పొలం డాక్యుమెంట్ ఫోర్జరీ చేయడంతో నిందితుడికి ఒంగోలు ఫస్ట్‌క్లాస్ అడిషినల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించింది. ఎస్ఐ అజయ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. చంద్రపాలెంకు చెందిన మల్లెల వెంకాయమ్మ కొన్నాళ్ల క్రితమే చనిపోయింది. అయితే సంతనూతలపాడుకు చెందిన చిట్టింశెట్టి అంకారావు సదరు మహిళ చనిపోకముందే తన పొలాన్ని స్వాధీన అగ్రిమెంట్ చేసినట్లు దొంగ వేలిముద్రలతో ఓ డాక్యుమెంట్ సృష్టించాడు. పొలం తనదని వెంకాయమ్మ భర్త మల్లెల సుబ్బారావుకు చెప్పాడు. దీంతో సుబ్బారావు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు చిట్టింశెట్టి అంకారావుపై ఎస్ఐ అజయ్‌బాబు కేసు నమోదు చేసి ఆదివారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.



మొంథా తుఫాన్‌పై అప్రమత్తం

టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించిన సీఎం చంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ పట్ల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ ప్రభావం వల్ల సోమవారం నుంచి మూడు రోజుల పాటు తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎస్ఎంఎస్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సా‌ప్‌ల ద్వారా ప్రజలకుముందస్తు హెచ్చరికలు పంపాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారాన్ని వేగంగా చేరవేసి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంత జిల్లాలకు వచ్చినట్లు తెలిపారు. సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం4 చేశామన్నారు. విద్యుత్ , టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలన్నారు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేశామని తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్లు చేపట్టాల్సిన విధి విధానాలను సీఎం చంద్రబాబు ఈసందర్భంగా వివరించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పీ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఈఆర్వో చిన ఓబులేశు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పీడీ మాధురి, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ,ఇతర అధికారులు

ముప్పును ఎదుర్కొనేందుకు సిద్ధం

● తుఫాన్ ప్రత్యేకాధికారి కోన శశిధర్



సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కోన శశిధర్

ఒంగోలు కలెక్టరేట్ : మొంథా తుఫాన్ ముప్పు నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ సెక్రటరి, మొంథా తుఫాన్ ప్రత్యేక అధికారి కోన శశిధర్ ఆదేశించారు. స్థానిక లెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఆదివారం సాయంత్రం కలెక్టర్ రాజాబాబుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శశిధర్ మాట్లాడారు. తుఫాన్ ముప్పు కారణంగా ప్రజల ప్రాణ,ఆస్తి నష్టాలు కలగకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని కోరారు. సముద్రతీర ప్రాంత మండలాల్లోని 18 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ రాజాబాబు జిల్లాలో మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను వివరించారు. అందుకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

జిల్లాలో 10.3 మి.మీ వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 10.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. కంభం 70.6, కొమరోలు 51.6, మద్దిపాడు 46.8. సీఎస్‌పురం 44.4, పామూరు 34.2, దోర్నాల 24.8, సంతనూతలపాడు 21.4, యర్రగొండపాలెం 19.4, మార్కాపురం 16.8, కనిగిరి 13.8, బేస్తవారిపేట 13.2, చీమకుర్తి 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో ఏడెనిమిది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

జిల్లాకు చేరుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

● కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో ముందస్తు చర్యలు

ఒంగోలు కార్పొరేషన్ : మొంథాముప్పుపై అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ డీజీపీ ఆదేశాలలో మంగళగిరి నుంచి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) బృందం ఒంగోలు చేరుకుంది. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో వారికి వసతి ఏర్పాటు చేయగా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో వారు తుఫాన్ ముంపు చర్యల్లో రెస్క్యూటీమ్‌గా వ్యవహరించనుంది. ఈ సందర్భంగా టీమ్ మేనేజర్ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఒంగోలుకు 25 మంది టీము విచ్చేసినట్లు తెలిపారు. తాము తుఫాన్ కారణంగా ప్రమాదాలు, విపత్తులు జరగకుండా ప్రజలను కాపాడేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. అలాగే తీర ప్రాంతంలోనైనా, వాగులు వంకలు పొంగిపొర్లి ప్రజలు చిక్కుకున్న ప్రాంతానికి చేరుకుని వారిని కాపాడటం జరుగుతుందని తెలిపారు. చెట్టు విరిగిపడినా, వివిధ విపత్తులపై తాము 24 గంటలు సిద్ధంగా ఉంటామని, అందుకు సంబంధించిన పరికరాలను కూడా తాము వెంట తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నగరపాలక సంస్థ సిబ్బందితో కమిషనరు కే. వెంకటేశ్వరరావు ఆదివారం సమావేశం అయ్యారు. 24 గంటలూ అందుబాటులో ఉండేలా షిఫ్టుల వారీగా శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందికి ప్రత్యేక విధులు విధించారు. మొంథాముప్పు కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అలాగే వర్షం తీవ్రతకు నగరం నీట మునగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత పనులు, అలాగే మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగు, ప్రత్యేకించి రోడ్లపై వర్షం నీరు నిలవకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.



మునిసిపల్ శానిటరీ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయిన కమిషనర్



వాహనం, రక్షణ సామగ్రితో ఉన్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం



పాలంక పుణ్యక్షేత్రం వద్ద కొండ నుంచి జాలువారుతున్న గంగమ్మ

పాలంకి కొండల్లో గంగమ్మ పరవళ్లు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అందాలు అంటే అందరికీ ఇష్టమే. ముఖ్యంగా వర్షాలు పడిన సమయంలో అంటే ప్రకృతి సోయగాల అందాలు చెప్పలేనివి. ప్రకృతి ప్రేమికులకు ఇష్టమైనది ఎర్రగొండపాలెం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ పాలంక వీరభద్రుని పుణ్యక్షేత్రం. తొలిఏకాదశి రోజున భక్తులు, పర్యాటకులు అక్కడకు వెళ్తుంటారు. అక్కడి కొండ చెరియల నుంచి వెలువడే జలపాతాలు ఆహ్లాదనిస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కొండ చెరియలు (వెయ్యి అడుగుల పైబడి) నుంచి జాలువారుతున్న నీటిని తిలకిస్తున్న ప్రకృతి ప్రేమికులు కెమెరాలో బంధించారు.



కనిగిరి తహసీల్దార్ కార్యాలయం

కనిగిరిలో ఆగని భూ అక్రమాలు

● అక్రమంగా ఆన్‌లైన్ ● ఇప్పటికే తహసీల్దార్ సస్పెన్షన్
● త్వరలో మరో నలుగురు వీఆర్వోలపై పడనున్న వేటు

కనిగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో భూఅక్రమాలు కొనసాగుతున్నాయి. గత వైసీపీ హయాంలో వేలాది ఎకరాలు పరులపరమయ్యాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బైపాస్, గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేస్టేషన్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. దీంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదేఅదనుగా కొందరు అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వాటిని కొట్టేస్తున్నారు.

ఆ ముగ్గురు మహిళలెవరు?

రాజకీయ నాయకుల ప్రోద్బలం, మద్దతుతో కనిగిరి ప్రాంతంలోని భూములు కొన్నింటిని ఇష్టానుసారంగా అక్రమ ఆన్‌లైన్‌లు చేసి కనిగిరి తహసీల్దార్ రవిశంకర్ సస్పెండయ్యారు. ఈ వ్యవహారం ఓపక్క రాజకీయ నేతల్లో, మరోపక్క అధికార వర్గాల్లో అలజడి రేపింది. దీంతోపాటు వెబ్‌ల్యాండ్‌లో జరిగిన అక్రమాల్లో ముగ్గురు మహిళలకు కలగట్ల గ్రామ సమీప ప్రాంతంలో రాజకీయనేతల సిఫార్సులతో తహసీల్దార్ అక్రమంగా భూములు కట్టబెట్టారన్న ఆరోపణలు పెద్ద చర్చగా మారాయి. ఇంతకూ ఆ ముగ్గురు మహిళలు అధికారపార్టీకి చెందినవారా..? ప్రతిపక్ష పార్టీకి చెందినవారా..? రాజకీయపార్టీలకే సంబంధం లేని వారా అంటూ పలు ప్రశ్నలు పుడుతున్నాయి.

గత ప్రభుత్వంలో కబ్జాలు చేసిన వారే ఇప్పుడు కూడా..

గత ప్రభుత్వంలో పలు భూ అక్రమాలకు పాల్పడిన నేతలే నేడు ప్రజాప్రభుత్వంలోని నాయకులతో జతకట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. వారి మద్దతుతో తిరిగి భూఅక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తహసీల్దార్‌తో పాటు ఆయా నేతలను కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయినా వారిలో మార్పు రాకపోగా పలు భూఅక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. మండలంలోని కందుకూరు రోడ్డులోని ఈదరవాగు ప్రాంతంలోని 12ఎకరాల భూమిని అక్రమంగా అసలు భూహక్కుదారుడిని తొలగించి వేరే వారిపై వెబ్‌ల్యాండ్‌లో చేర్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మండలంలోని కలగట్ల వద్ద ఏర్పాటవుతున్న రైల్వేస్టేషన్ సమీపంలో వేరేవారి పేరుతో ఉన్న భూమిని అక్రమార్కుల పేరుతో మార్చేసారని తెలియటంతో సంబంధిత అసలు భూ హక్కుదారులు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అలాగే మండలంలోని చల్లగిరగల ప్రాంతంలోని సెటిల్‌మెంట్ భూమిని అక్రమంగా మరొకరి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో చేర్చటంపై పెద్ద వివాదమే ఏర్పడింది. ఈవిషయం కాస్తా రాజధానికి చేరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి ఫోన్‌లు రావటంతో ఆయన తీవ్రంగా పరిగణించి తహసీల్దార్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు నెలలుగా జరిగిన వెబ్‌ల్యాండ్‌పై విచారణ చేయాలని నేరుగా జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేయటంతో కథ అడ్డం తిరిగింది. దీంతో ఒంగోలు ఆర్డీవో కళావతిని విచారణాధికారిగా నియమించటంతో సంబంధిత దస్త్రాలన్నీ ఒంగోలు తీసుకువెళ్ళి పరిశీలించగా వాస్తవాలు వెలుగుచూశాయి. దీంతో తహసీల్దార్ రవిశంకర్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి మండలంలో పనిచేసిన వీఆర్వోలే తిరిగి ఇదే మండలంలో పనిచేస్తుండటంతో అక్రమాల పరంపర కొనసాగుతూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో తుమ్మకుంట వీఆర్వోగా పనిచేసిన ఓ మహిళా వీఆర్వో ఓపేద బ్రాహ్మణుడికి చెందిన సర్వే నెంబరు 62లోని 5ఎకరాల భూమని రికార్డులు తారుమారుచేసి మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేయించి లక్షలాది రూపాయలు నజరానా తీసుకున్నట్లు సమాచారం. చీర్లదిన్నె ప్రాంతంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఓ మహిళా వీఆర్వో కూడా పొట్టకూటి కోసం గుంటూరు పనులకు వెళ్లిన ఉంటున్న ఓ పేద ముస్లిం కుటుంబానికి చెందిన వారి భూమిని చీర్లదిన్నె గ్రామంలోని మరొకరి పేరుపై మార్చేసినట్లు తెలుస్తోంది. చల్లగిరగల, బల్లిపల్లి, ఏరువారిపల్లి, తుమ్మకుంట, చాకిరాల, పునుగోడు, శంకవరం, కలగట్ల, వంగపాడు ప్రాంతాల్లో పలు భూఅక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరో నలుగురు వీఆర్వోలపై కూడా త్వరలో సస్పెన్షన్ వేటు పడనున్నట్లు తెలుస్తోంది.

త్వరలో మరో నలుగురు వీఆర్వోలపై వేటు

'సాహితీ' సావిత్రి



జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికైన ఈదుమూడి ఉపాధ్యాయురాలు
వ్యర్థాలతో బొమ్మల రూపకల్పన
సాహిత్యంతో పాటు అభిరుచులు
ఎన్నో అవార్డులు, పురస్కారాలు, ప్రశంసలు

నాగులుప్పలపాడు,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులను సరైన మార్గంలో నడిపించేది.. సమాజంలో మనకు గౌరవం కల్పించేది.. లక్ష్యాలను చేరుకొనేలా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. అలాంటి కోవకు చెందిన ఉపాధ్యాయురాలు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కనమర్లపూడి సావిత్రి. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఎక్కడా రాజీ పడకుండా తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూ ఉపాధ్యాయుడైన భర్త ప్రోత్సాహంతో సాహిత్యంతో పాటు తన అభిరుచులతో ఎన్నో ప్రశంసలు, అవార్డులు, పురస్కారాలను అందుకొన్నారు. అలా ఉపాధ్యాయ రంగంలో రాణిస్తున్న వారికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారు అందించే జీవన సాఫల్య పురస్కారానికి ఆమె ఎంపిక కాగా ఈ నెల 28 న పుదుచ్చేరిలో అవార్డును అందుకోనున్నారు.

సాధారణ ఉపాధ్యాయురాలిగా...

పామూరుకు చెందిన కనమర్లపూడి సావిత్రి పదవ తరగతిలో ప్రథమురాలిగా మార్కులు సాధించి గురువుల మన్ననలు అందుకున్నారు. ఇంటర్‌లోనూ అదే ప్రతిభ చూపించి లెక్చరర్లతో శభాష్ అనిపించుకున్నారు. ఎంసెట్‌లో పాల్గొని ఎంబీబీఎస్‌లోడెంటల్ విభాగంలో సీటు సాధించి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వెనుకకు వచ్చారు. తిరిగి డైట్ సెట్‌లో 13వ ర్యాంక్ సాధించారు. మైనంపాడు డైట్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణలో ప్రథమరాలుగా ఎంపికయ్యారు.

వివాహం అనంతరం ఉపాధ్యాయురాలిగా ...

తల్లిదండ్రుల కోరిక మేరకు కనమర్లపూడి సావిత్రి పమిడిపాడు గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు గాదంశెట్టి శ్రీనివాసులను వివాహం చేసుకొన్నారు. అనంతరం 2000 సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీలో 44వ ర్యాంక్ సాధించి పీసీపల్లి మండలం గడ్డమీదపల్లి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం నాగులుప్పపాడు మండలం ఈదుమూడికి బదిలీపై వచ్చిన ఆమె విద్యార్థులను ఉన్నతంగా నడిపిస్తూనే జనవిజ్ఞానవేదికలో కార్యకర్తగా పనిచేస్తున్నారు.



ఉగాది పురస్కారం అందుకుంటున్న సావిత్రి

సాధించిన అవార్డులు.. ప్రశంసలు ..

- చీరాలలో 2010 లో టీఎల్ఎం ప్రదర్శన చేసి ఎడ్యుకేషనల్, ట్రైనింగ్ అసోసియేట్స్ వారిచే అభినందన
- 2011 లో ప్రపంచ తెలుగు రచయితల మహా సభలలో పాల్గొని సత్కారం
- 2012లో సింధు సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం
- 2014 లో శాంతివనం వారిచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 22 వ చిన్నారుల నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌కు రాష్ట్రస్థాయి ప్రదర్శన
- 2015లో తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం, మద్రాస్ యూనివర్శిటీలో తెలుగు కవి సమ్మేళనంలో సత్కారం
- 2017 లో ప్రపంచ తెలుగు కవితోత్సవంలో సత్కారం, భారత్‌బుక్స్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- 2018లో వాసవీక్లబ్, ఒంగోలు విజన్‌వారిచే విద్యారంగ ప్రతిభా పురస్కారం
- 2019లో విశాఖపట్నంలో మదర్ థెరిస్సా సోషల్‌వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌సభలో రాష్ట్ర స్థాయి గురు బ్రహ్మ అవార్డు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితుల సంఘం వారిచే నెల్లూరులో సత్కారం
- 2020 లో తిరుపతిలో సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డును సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి నుంచి అందుకొన్నారు.
- 2022 లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం
- 2023లో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో జరిగిన సంపూర్ణ శతావధానంలో ప్రశంసాపత్రం
- 2024 ఉగాది వేడుకల్లో కలెక్టర్ నుంచి ఉగాది పురస్కారం, అద్దంకి పుట్టంరాజు బుల్లయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శతావధానంలో ప్రశంసాపత్రం

2025 లో నెల్లూరు జేసీఐ నుంచి నారీశక్తి పురస్కారం..

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాత రిమ్స్‌లో నిర్మాణంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్‌టీజీఎస్) భవనాన్ని కలెక్టర్ పీ రాజాబాబు ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల వివరాలతో పాటు సంబంధిత నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఆభవన నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు తదితరులు ఉన్నారు

హరహర మహాదేవ!

● నేడు కార్తీకమాస తొలి సోమవారం
● శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు
● దీపారాధనలకు పెద్దసంఖ్యలో రానున్న మహిళలు
● అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయాల అధికారులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అత్యంత విశేషమైనదిగా భక్తులు భావించేది సోమవారం. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన వారం కావటం, శివునికి సోముడు అనే పేరు ఉండటం కూడా ఇందుకు కారణం. అటువంటి కార్తీకమాసంలో తొలి సోమవారం నేడు. దీనితో జిల్లావ్యాప్తంగా పలు శివాలయాలలో వేకువజాము నుంచి పరమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, అదేవిధంగా అమ్మవారికి కుంకుమార్చనలు జరుగనున్నాయి. ఇక సహజంగా కార్తీకమాసం నెలరోజులు మహిళలు తమ ఇళ్ల వద్దే కాకుండా దగ్గరలో ఉన్న శివాలయంలో సైతం దీపారాధనలు చేస్తారు. అందులోను నేడు కార్తీక సోమవారం కావటంతో మహిళలు శివాలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. దీనితో దీపారాధనకు వచ్చే మహిళలకు ఎటువంటి అసౌర్యం కలుగకుండా ఆయా దేవస్థానాల అధికారులు, నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. వారికి అవసరమైన ప్రమిదలు అందుబాటులో ఉంచటం, ఇక దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు వంటి ఏర్పాట్లు చేసినట్లు ఒంగోలు నగరం కేశవస్వామిపేట శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థాన ఈవో ఆర్.శివశంకర్ తెలిపారు. అదేవిధంగా మహిళలు దేవస్థాన ప్రాంగణంలో దీపారాధనలు చేసుకోవటానికి, అదేవిధంగా ఎటువంటి తోపులాట లేకుండా స్వామివార్లను దర్శించుకోవటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కొత్తపట్నం బస్టాండు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఈవో బోడపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో పోలీసుల తనిఖీలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను పోలీసులు తనిఖీలు చేసారు. ఆదివారం రాత్రి స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద ట్రావెల్స్ బస్సులను ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. బస్సులలో మంటలు ఆర్పే పరికరాలు ఉన్నాయా లేవా, ఉంటే అవి బస్సు డ్రైవర్‌కు వినియోగించడం తెలుసా లేదా అని డ్రైవర్లతో డెమో నిర్వహించారు. అనంతరం బస్సు డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించారు. ప్రయాణికులకు బస్సులో అన్నీ సౌకర్యాలు ఉన్నాయో లేవో తనిఖీలు చేశారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. పొంగళ్లు ఒండి నైవేద్యాన్ని సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలోని బాలబాలికలకు యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వారు పరీక్ష అట్టలు, వాటర్ బాటిల్స్ ఇతర విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు రత్నం, సిద్దయ్య, కిశోర్ తదితరులతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో లీకులు

» వాన నీరు కారుతుండడంతో భక్తులకు ఇబ్బందులు
» చర్యలు చేపట్టాలని పురావస్తు శాఖ అధికారులకు విజ్ఞప్తి

రాచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సత్యవోలు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో స్లాబు నుంచి వర్షపునీరు లీక్ అవుతూ పూజలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఏళ్లనాటి పురాతన దేవాలయం కావడంతో మరమ్మతులకు గురైంది. పురావస్తు శాఖ అధికారులు 15 ఏళ్ల కిందట ఆలయానికి మరమ్మతులు చేశారు. అందులో భాగంగా స్లాబ్‌ను నిర్మించారు. స్లాబ్ నిర్మాణం పటిష్టంగా లేకపోవడంతో గర్భగుడి, మండపం తదితర చోట్ల స్లాబు నుంచి వాన నీరు లీకై ఆలయంలోకి చేరుతుంది. దీంతో పూజలు చేసుకునేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తున్నారు. స్లాబు నుంచి వాన నీరు కారుతుండడంతో ఇబ్బంది కలుగుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు లీకులు లేకుండా పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

అనివార్య కారణాలతో మరమ్మతులు చేయించడానికి వీలు కాలేదు

దీనిపై ఒంగోలు పురావస్తు శాఖ సీఏ జీ యశ్వంత్‌రెడ్డిని వివరణ కోరగా కొన్ని అనివార్య కారణాల వలన మరమ్మతులు చేయించడానికి వీలు కాలేదని వచ్చే మార్చి నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

- యశ్వంత్‌రెడ్డి, సీఏ, పురావస్తు శాఖ, ఒంగోలు


ఆలయంలో ఉన్న వాన నీరు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

సీఎం సహాయనిధి పేదలకు వరం

29 మందికి చెక్కుల పంపిణీ

ఎర్రగొండపాలెం,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం 29 మందికి రూ.23,27,678లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, మండలపార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, పోట్ల గోవింద్, మేకల వళరాజు, మెట్టు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కల్తీ మద్యంకు అడ్డుకట్ట

కల్తీ మద్యానికి అడ్డుకట్టు వేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక బ్రాందీ షాప్ వద్ద ఆదివారం సురక్ష మొబైల్ యాప్ పోస్టర్‌ను ఆయన ఎక్సైజ్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షునికి పరామర్శ

పెద్ద దోర్నాల : మండల సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి ఇటీవల కుడి చేయికి శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఎరిక్షన్‌బాబు ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ చిత్తూరి హారిక, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య,కే సుబ్బారెడ్డి, దేసు నాగేంద్ర బాబు దర్శనం దేవయ్య, ఎలకపాటి చంచయ్య, బాబు, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి, మీర్జపేట, తర్లుపాడు, గొల్లపల్లి గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్న వారికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. మొత్తం 11 మంది లబ్ధిదారులకు రూ.7,33,082 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, పి.గోపినాథ్ చౌదరి, వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాడు, నేడు టీడీపీ పాలనలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పట్లో వేలకోట్లతో పరిశ్రమలను ఆహ్వానించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వెళ్లి మాట్లాడకుండా వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటని ఎరిక్షన్‌బాబు ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు అనేక పారిశ్రామిక కంపెనీలకు పర్మిషన్‌లు ఇచ్చి కంపెనీలు స్థాపించేందుకు వస్తే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి భయపెట్టి కంపెనీలు పరారయ్యేలా చేశారన్నారు. అనంతపురం జిల్లాలో కియా కార్ల కంపెనీ తీసుక వచ్చింది చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జగన్‌రెడ్డి ప్రారంభించి ప్రజలను మోసగించారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మెయిన్ ఫీడర్ పనులకు రూ.456 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. తాను ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేయిస్తున్నానని ఎరిక్షన్‌బాబు తెలిపారు. ప్రజల ఓట్లతె గెలిచిన మీరు ప్రజల మధ్యకు వెళ్లకుండా టీవీ చానళ్లలో మాట్లాడడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే మీరు లేవని చెప్పడం సరికాదని హితవు పలికారు. ఆయనతోపాటు ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, పోట్ల గోవింద్, శ్రీను, కోటయ్య, బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో తాత్కాలిక కాలువల నిర్మాణం

కంభం, అక్టోబరు, 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంభం అర్బన్ కాలనీ వీధులలో, గృహాలలో నీరు నిలిచిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ ఎన్నారై రఫి ఆదివారం కంభం పంచాయతీ సిబ్బంది, ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్లకు ఇరువైపులా తాత్కాలికంగా కలువను తవ్వించారు. కాలనీలో నిలిచిన నీటిని మొత్తం బయటకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఇకపై వర్షం కురిసినా నీరు ఇండ్లలోకి రాకుండా రోడ్లపై నిలబడకుండా నేరుగా కాలువల్లోకి వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు రఫి తెలిపారు. మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యేతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెడతామని కాలనీ ప్రజలకు హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ఎన్నారై రఫి వెంట నాయకులు మొగల్ ఉస్మాన్ భేగ్, షేక్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

త్వరలో శాశ్వత మరమ్మతులు

రాచర్ల, అక్టోబరు, 26 (ఆంధ్రజ్యోతి) : సంగపేట - జగ్గంబొట్ల కృష్ణాపురం మధ్య దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు త్వరలో శాశ్వత మరమ్మతులు చేపడతామని గిద్దలూరు ఆర్‌అండ్‌బీ డీఈ ఏ రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూశామని, త్వరలో నిధులు మంజూరు చేయించి శాశ్వత మరమ్మతులు చేపట్టం జరుగుతుందన్నారు. మండలంలోని అనేక ప్రాంతాలలో వర్షాలతో రోడ్లకు నష్టం వాటిల్లిందని వాటన్నింటినీ సంబంధిత అధికారులతోపాటు ఎమ్మెల్యే పరిశీలించారని త్వరలో అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్, రామాపురం సొసైటీ బ్యాంకు ఛైర్మన్ భవనం పుల్లారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మన్‌కీబాత్‌ను వీక్షించిన నాయకులు

గిద్దలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మన్‌కీ బాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని 203 పోలింగ్ బూతులో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ ఆధ్వర్యంలో లైవ్‌లో వీక్షించారు. కాఫీ పంటల సాగు - జీవనోపాధి, చేపలు, డాల్ఫిన్‌ల వృద్ధి, విదేశీ పక్షులు ఇక్కడకు వచ్చేలా ప్రకృతిని కాపాడుకోవాలని, నిఘా వ్యవస్థలో కుక్కల ప్రాముఖ్యత, యూనిటీ ఆఫ్ ఇండియా, వందేమాతరం, భిన్నత్వంలో ఏకత్వం తదితర అంశాల గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించినట్లు నాయకులు తెలిపారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

గిద్దలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల చేపట్టిన సామాజిక కార్యక్రమాలను వివరించారు. సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ డీజీ బ్రహ్మానందరెడ్డి సంస్థకు మైక్‌సెట్‌ను బహూకరించారు. అత్యధికంగా సభ్యత్వాలు చేయించిన విశ్వనాథ్‌ను సంస్థ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడు గంజి వీరయ్య, ఛైర్మన్ శివారెడ్డి, కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ పిచ్చయ్య, పాల్గొన్నారు.

అడుగు వేయాలంటే ఆటోనగర్‌లో బేజారు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులోని ఆటో నగర్‌లో వర్షం వస్తే చాలు కార్మికుల కష్టాలు వర్ణణాతీతం. ఇటీవల కురిసిన వర్షాలకు ఆటోనగర్‌లో రోడ్లపై, షెడ్లలో వర్షపు నీరు నిలిచింది. ఆటో నగర్‌లో సరైన రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో లోతట్టు ప్రాంతం కూడా కావడంతో వర్షం పడిందంటే చాలు పనులు నిలిచిపోతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న మొంథా తుఫానుతో తమ కష్టాలు మరింత పెరుగుతాయామోనని భయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, తమ సమస్యలు పట్టించుకోవాలని కోరుతున్నారు.


ఆటో నగర్‌లో నిలిచి ఉన్న నీరు

మొంథాపై అప్రమత్తం

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుండి ముంతా తుఫాన్ ప్రభావం ఉండబోతుందని వాతావరణశాఖ హెచ్చరించడంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆదివారం ఎంపీడీవో, పోలీసుశాఖ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సగిలేరువాగు, కంభం మండలంలో గుండ్లకమ్మ వాగులు ప్రవహిస్తున్నాయని, వాటి ప్రవాహంలో ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. తాను ఇప్పటికే తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించానని, పలు మండలాల్లో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పాత భవనాలలో నివాసం ఉన్న వారిని సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించాలన్నారు. గ్రామస్థాయిలో ముంతా తుఫాన్ ప్రభావంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని, లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు సమస్య ఏర్పడితే తక్షణమే సిబ్బందికి గానీ, తనకు గాని ఫోన్ చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు.


సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి వెంకట సత్యనారాయణ

ముంతా తుఫాన్ ప్రభావంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం తహసీల్దార్ ఆంజనేయరెడ్డి అధ్యక్షతన అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్, పోలీసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, అగ్నిమాపకం, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు

మార్కాపురం : జిల్లాపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రభావం చూపనున్న మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, పీఎస్‌వీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎమ్.వెంకటసత్యనారాయణ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం పట్టణ, మండల పరిధిలోని కీలకమైన శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఇప్పటికే అల్పపీడన ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి గ్రామంలోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాణ, ఆస్తి, పశు నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, మండల అధికారులు వారికి కేటాయించిన కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. చప్టాలు, వాగులు, నదుల వద్ద సిబ్బందిని ఉంచాలన్నారు. కంట్రోల్ రూం ఇప్పటికే ఏర్పాటైనందున ఎలాంటి చిన్నపాటి విపత్తు సంభవించినా వెంటనే అప్రమత్తం కావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బీవీఎస్.నారాయణరావు, తహసీల్దార్ కె.చిరంజీవి, పంచాయతీరాజ్ ఏఈ మోహన్ రాజా, విద్యుత్ ఏఈ యశోద, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో తగ్గని వరద

» రెండు రోజులుగా నీటి మునకలో మిరప
» రైతుల్లో మొంథా గుబులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిరప సాగు చేసిన రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. గతం వరకు అనావృష్టితో ఇబ్బందులు పడి వాన కోసం ఎదురుచూసి వేయి దేవుళ్లకు మొక్కారు. ఈ ఏడాది సకాలంలో వానలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఎన్ని కష్టాలైన ఎదురొడ్డి వేలకు వేలు పోసి మిరప సాగు చేపట్టారు. ఇప్పుడేమో కుండపోత వానలు కురుస్తున్నాయి. చెరువులన్నీ నిండాయి. వాగులు,వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎన్నడూ లేనంతగా నెల రోజులకు పైగా కాలువలు ప్రవహిస్తూనే ఉన్నాయి. అలుగులపై నుంచి వరద నీరు పంట పొలాలపై ప్రవహిస్తూ పంటలను దెబ్బతీస్తున్నాయి. కనీసం పొలాల్లోకి నీరు రాకుండా చేద్దామన్నా వీలు పడడం లేద పంటలను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు కూడా అవకాశంలేక కళ్ల ముందే చేతికొచ్చే పంట నష్టపోతున్నా కాపాడే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతివృష్టి కారణంగా సాగు చేసిన పంట నిబడుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు వాన తెరిపిస్తే అప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులు ఎదురు చూస్తున్నారు. మళ్లీ రెండ్రోజులపాటు మొంథా తుఫాన్ ప్రభావం కూడా ఉంటుందన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికతో రైతుల్లో గుబులు నెలకొంది. ఉందన్న వాతావరణ శాఖాధికారుల ప్రకటన రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. గతేడాది మిర్చిలో విపరీతంగా నష్టపోయారు. కీలకదశలో నీటి తడులు అందక కొంత భాగం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అధిక భాగం మంది రైతులు కాయలు కోసిన కూలీలకు డబ్బులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఈ ఏడాదైనా ధరలు అనుకూలంగా రాకపోతాయా అన్న ఆశాభావంతో తిరిగి మిరప విస్తారంగా సాగు చేశారు. మం డలంలో సుమారు 3,600 ఎకరాల్లో సాగయింది. కానీ ఇదే పరిస్థితి కొన్ని రోజులు కొనసాగితే లెక్కకు రాని నష్టం వాటిల్లుతుందని రైతులు కుంగిపోతున్నారు. ప్రభుత్వం స్పందించాలని, సంబంధిత అధికారులు రోడ్ల పక్కన ఉన్న కొన్ని భూములు పరిశీలించి నామ మాత్రంగా నివేదికలు తయారు చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.


తిమ్మాపురం పంట పొలాల్లో ప్రవహిస్తున్న వరద నీరు

మిరప పైరు పరిశీలన

కంభం : కంభం, అర్ధవీడు మండలాలలో నీట మునిగిన మిరప పైరుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యాన అధికారి శ్వేత రైతులకు తెలిపారు. ఆదివారం ఆమె కంభం మండలం లింగోజిపల్లి గ్రామంలో నీట మునిగిన మిరపను పరిశీలించారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో మిరప మొత్తం నీట మునిగింది. విషయం తెలుసుకున్న శ్వేత లింగోజిపల్లి వెళ్లి పైర్లను పరిశీలించారు. పైరు ఉరకెత్తి తలలు వాలినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10గ్రాముల యూరియ కలిపి పిచికారీ చేయాలన్నారు.

గుండ్లకమ్మ వరద ఉధృతిపై జాగ్రత్తలు

త్రిపురాంతకం : గుండ్లకమ్మకు పెరిగిన వరద ఉధృతి కారణంగా గ్రామాల్లోకి నీరు ప్రవేశించకుడా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. త్రిపురాంతకం మండలంలోని ముడివేములతోపాటు గుండ్లకమ్మకు ఆవలవైపు కురిచేడు మండల పరిధి గ్రామాల్లోకి నీరు ప్రవేశించే అవకాశం ఉండటంతో జేసీబీ సహాయంతో నీటి మళ్లింపు చర్యలను ఎంపీడీఓ రాజ్‌కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు.


నీటి మళ్లింపు చర్యల్లో ఎంపీడీవో రాజ్‌కుమార్

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

కంభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ, సేవ ద్వారానే సత్యసాయి కృపను పొందగలమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీ సత్యసాయి బాబా ఆలయంలో నిర్వహించిన సత్యసాయి 100వ జయంతి వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయిబాబాకు నిర్వహించిన ప్రత్యేక అలంకరణ కార్యక్రమంలో పాల్గొని హారతి ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఆర్మీ అమరవీరుల స్థూపానికి రూ.లక్ష విరాళం

రాచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీ అమరవీరుల స్మారక స్థూప నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మండలంలోని చోళవీడు గ్రామంలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని మండల మాజీ సైనికులు కలిసి ఆకవీడు గ్రామంలో ఆర్మీ అమరవీరుల స్మారక స్థూప నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా స్పందించిన ఆయన విరాళాన్ని ప్రకటించారు. అలాగే ప్రభుత్వ పరంగా సాయమందేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి సైనికులు, మాజీ సైనికుల సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి అరవింద్‌కు నివాళి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): షైనంపాడులో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందిన విద్యార్థి అరవింద్ మృతదేహానికి టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. అరవింద్ మృతదేహాన్ని అంకనాంపల్లెకి తీసుకురాగా కృష్ణకిశోర్‌రెడ్డితోపాటు మార్కెట్‌యార్డు ఛైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు బోదనబోయిన గోపాలక్రిష్ణ, శేఖర్, రామక్రిష్ణ, విజయరాజు, సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఉపాధ్యాయులకు సెలవులు లేవు

రాచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు సెలవులు ఉపాధ్యాయులకు కాదని విద్యార్థులకు మాత్రమేనని ఎంఈవో వీ గిరిధరశర్మ అన్నారు. ముంథా తుఫాన్ కారణంగా ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిందని, ఆ సెలవులు విద్యార్థులకు మాత్రమేనన్నారు. ఉపాధ్యాయులు యథావిధిగా పాఠశాలకు రావాలని సూచించారు. రెవెన్యూ లేదా సచివాలయ ఉద్యోగులు పాఠశాలలకు సంబంధించిన తాళాలు అడిగితే వెంటనే వారికి ఇవ్వాలన్నారు. పాఠశాలల పరిధిలో ఎలాంటి చిన్నాపాటి నష్టం జరిగినా ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లపై చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. జిల్లా అబ్జర్వర్ కోన శశిధర్ ఆదేశాలు విద్యాశాఖ అధికారులందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు



మార్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో వాళ్ల మీద అలిగి యువకుడు కనిపించకుండా పోయిన విషయమై టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. స్థానిక ఎస్టేట్‌లోని శాంతినగర్‌లో నివాసముంటున్న చింతకుంట్ల మరియదాస్ తన కుమారుడు నగేష్‌ను చదువుకోమని మందలించాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులపై అలిగిన నగేష్ శనివారం సాయంత్రం 6.00 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఎక్కడా కనిపించకపోయేసరికి మరియదాస్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



బేస్తవారపేట, అక్టోబరు 26 (ఆంధ్రజోతి) : బేస్తవారపేట బీసీ కాలనీలోని మసీద్ వద్ద మినార్ కట్టడానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు వ్యక్తులు నెలకిందట వచ్చి పనులు చేస్తున్నారు. రోజులాగే ఆదివారం నిర్మాణ పనులు చేస్తుండగా ఇనుప తీగెలకు విద్యుత్ వైరు తగిలి షానవాస్(23), ఖాన్ ఇతిజార్ షాక్‌కు గురయ్యారు. వారిని వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా షానవాస్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఖాన్ ఇతిజార్‌కు ప్రథమ చికిత్స అందించి, మార్కాపురం వైద్యశాలకు తరించారు. మరో నెలలో షానవాస్‌కు వివాహం జరుగనుందని మసీద్ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. మండలంలోని పలుగుంటిపల్లి గ్రామానికి చెందిన పూల నాగేంద్ర, నన్నెబోయిన వేణు మరో వ్యక్తితో కలిసి తమ ద్విచక్రవాహనంపై గిద్దలూరు నుంచి రాచర్ల వెళ్తున్నారు. వారికి ముందుగా గిద్దలూరు నుంచి కంభం వైపు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. దానిని ఓవర్ టేక్ చేయబోయి రాచర్ల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఇరువురికి బలమైన గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. గిద్దలూరు మార్కెట్ యార్డ్ సమీపంలోని ఫుడ్ కోర్టు వద్ద ప్రమాదం జరిగింది. 108సిబ్బంది గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

మోటార్‌బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం : మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండల పరిధి లోని రాజుపాలెం వద్ద రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో గోపీ, నాసరయ గాయపడ్డారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. పలువురు వాహనదారులు వాహన పూజలు చేయించారు. మరికొందరు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు కుంకుమ పూజలు నిర్వహించారు. పూజారులు కామేశ్వరశర్మ, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఆర్‌ఫీ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా రద్దు

పామూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఈటీఎస్‌అండ్‌ఎల్ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగే మెగా జాబ్‌మేళాను తుఫాన్ నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

తెలుగు యువత కార్యవర్గం

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో సీఎస్‌పురం మండల, పట్టణ తెలుగుయువతగా అధ్యక్షులుగా కామనబోయిన వెంకటస్వామి, తోట చిన్నాను నియమించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాయలంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలుగుయువత మండల కార్యదర్శిగా బోరిగొర్ల కొండయ్య, ఉపాధ్యక్షులుగా బోయిన మాలకొండయ్య, వేంపాటి బాలకాశయ్య, కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఇండ్ల శ్రీను, బాబు, కోటగిరి ప్రసాద్, కార్యదర్శిగా బి.సురేష్‌ను నియమించారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డినగర్ వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ఆటోను, కారును లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ఉన్న కనుమూరి మోషే గాయపడ్డారు. దర్శి మండలం తూర్పువీరాయపాలెం నుంచి ఆటో ముండ్లమూరు వైపు వస్తుంది. వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. అదేక్రమంలో దర్శి నుంచి వస్తున్న కారునూ ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటోలో ఉన్న మోషేకు గాయాలుకాగా దర్శిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రజాఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

పామూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేట్‌పరం చేయటాన్ని వైసీపీ వ్యతిరేకిస్తుందని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28న కనిగిరిలో జరిగే ప్రజా ఉద్యమం ర్యాలీలో వైసీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో తాలుకా అధ్యక్షుడిగా రమణారెడ్డి

కనిగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో కనిగిరి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పామూరు రోడ్డులోని సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీపీ రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.జక్రయ్య, కార్యదర్శిగా హజరత్‌అలీ, కోశాధికారిగా మల్లికార్జునరావు, ఇతర సభ్యులను ఎనున్నకున్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, సెక్రటరీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకు చేరిన సాగర్ జలాలు

ముండ్లమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలోని చివరి భూములకు రెండు దశాబ్దాల తరువాత సాగర్ జలాలు చేరాయి. మోదేపల్లి మేజరుకు పమిడిపాడు బ్రాంచ్ నుంచి సరఫరా అయ్యే సాగర్ జలాలు ఎగువ ప్రాంతమైన ఉమామహేశ్వర అగ్రహారంతో పాటు నాయుడుపాలెం వరకే నీరు వచ్చేది. దిగువ భాగమైన శంకరాపురం, పోలవరం, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లి గ్రామాలకు నీరు రాక ఆయకట్టు పరిధిలోని భూములన్నీ మెట్ట పైర్లు సాగు చేసుకొనేవారు. గత రెండు మూడు రోజుల నుంచి రెండు దశాబ్దాల తరువాత కాలువ చివరి భూముల వరకు నీరు ప్రవహించటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముంచుకొస్తున్న 'మొంథా'

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు

దర్శి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉంది. దీనిప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈమేరకు విపత్తుల నివారణ శాఖ నుంచి సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ఈక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దర్శి మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం మండల స్థాయి అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని, ఏమైనా ఇబ్బందులు వస్తే కంట్రోల్ రూమ్ నంబరు 9553832347కు ఫోన్ చేయాలని సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్నిముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి గాయత్రీదేవి, ఎంపీడీవో బికల్పన, డిప్యూటీ ఎంపీడీవో అవుల సుధాకర్, ఎంఈవో కె.రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

పీసీపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి అత్యవసర పరిస్థితుల నైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి పి.భాస్కర్‌బాబు ఆదేశించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో 27,28,29 తేదీలలో మూడు రోజులు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పాలేరు నది సమీపంలోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు విద్యుత్, రవాణా, వైద్య, పశువైద్య శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో జీవీ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ, డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పశువైద్యాధికారి అవులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేకాధికారి భాస్కర్‌బాబు వితలాపురం చెరువును పరిశీలించారు.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా కంట్రోల్ రూం హెల్ప్‌లైన్ నెంబరు 8019738536కు ప్రజలు సమాచారం అందించాలని తహసీల్దార్ ఉష కోరారు.

వెలిగండ్ల: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎన్.వాసు అన్నారు. ఆదివారం వెలిగండ్లలో జరిగిన మండలస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశామని, అత్యవసరమైతే 92810 34473 నెంబరును సంప్రదించాలన్నారు.



దర్శిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు



పీసీపల్లి: అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి భాస్కర్‌బాబు

ముండ్లమూరు: మొంథా తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల స్థాయి అధికారులు ప్రజలను అప్రమత్తంచేసి అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వాగులు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎంశ్రీదేవి, తహసీల్దార్ ఎల్.లక్ష్మీ నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మొంథా తుఫాన్‌తో ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఏ.కుమార్ అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు చెరువులు నిండి కట్టలు దెబ్బతినే వీలున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తాళ్లూరు- విఠలాపురం మార్గంలో గల దోర్నపువాగు చప్టాను, చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.అజిత, ఎంఈవో సుబ్బయ్య, ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

దొనకొండ: తుఫాన్ నేపథ్యంలో ప్రజల్ని అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారి పి.మదన్ మోహన్ ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు నష్టం కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వసంతరావునాయక్, తహసీల్దార్ రమాదేవి, విద్యుత్ ఏఈ నాగూర్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలకు వెళ్లొద్దు!

పామూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాతావరణం శాఖ జారీ చేసిన మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కార్తీక సోమవారంన సముద్ర స్నానాలకు వెళ్లవద్దని సీఐ ఎం.భీమానాయక్ విజ్ఞప్తి చేసారు. సీఎస్‌పురం మండలంలోని భైరవకోనలోని జలపాతం వద్ద స్నానాలు ఆచరించడానికి వచ్చే పర్యాటకులు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రావద్దన్నారు. వాటర్ పాల్స్ వద్ద నీటి ఉధృతి తీవ్రంగా ఉండటమే కాకుండా భైరవకోనకు వచ్చే దారిలో చప్టా వద్ద వరద నీరు అధికంగా ప్రవహిస్తుందని చెప్పారు.

టీడీపీలో క్రమశిక్షణతో మెలగాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- వైసీపీ సర్పంచ్‌తో సహా 20 కుటుంబాలు పార్టీలో చేరిక



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమక్షంలో సర్పంచ్ దుంపా సంపూర్ణతోపాటు టీడీపీలో చేరిన చింతగుంపల్లి గ్రామస్థులు

కనిగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీలో క్రమశిక్షణతో మెలుగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం చింతగుంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ దుంపా సంపూర్ణ 20 కుటుంబాలతో కలిసి మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఙ్ఞకురూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. టీడీపీలో ఉన్న నాయకులు వైసీపీని వీడి వచ్చినవారిని కలుపునకుపోయి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. టీడీపీలో చేరిన సర్పంచ్ దుంపా సంపూర్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో పాటుపడుతున్నారన్నారు. కనిగిరి ప్రాంతాభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి టీడీపీలో చేరినట్టు చెప్పారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో చింతగుం పల్లి గ్రామంలో తెలుగుదేశం విజయకేతం ఎగురవేస్తుందన్నారు. కార్యక్రమంలో చింతగుంపల్లి నాయకులు మల్లికార్జునరెడ్డి, పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వారధిపైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వారధిని పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్

కురిచేడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం ముష్టగంగవరం గ్రామం వద్ద గుండ్లకమ్మ నదిపై నిర్మించిన రైతు వారధిపైగా వరద నీరు ప్రవహి స్తుంది. దీంతో కురిచేడు, త్రిపురాంతకం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుండ్లకమ్మ నదికి ఉధృతం గా నీరు వచ్చింది. నీటితో పాటు తూటుకాడ కూడా పెద్ద ఎత్తున వచ్చి రైతు వారధి గొట్టాలకు అడ్డుపడి మూసుకుపోయాయి. దీంతో నీరు వారధి పైనుంచి నీరు ప్రవహిస్తుంది. తహసీల్దార్ రజనీ కుమారి తమ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ ఆదివారం రైతు వారధిని పరిశీలించారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేసి వారధి గొట్టాలకు అడ్డుపడ్డ తూటు కాడను తొలగించారు. కొంతమేర వారధిపై నీటి ప్రవాహం తగ్గింది. అలాగే వారధికి నష్టం కలుగకుండా మట్టితో కట్టలను పటిష్టం చేశారు. ఎవరూ వారధిపై ప్రయాణం చేయవద్దని సూచాంచారు. తుఫాన్ నేపథ్యంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఎస్ఐ శివ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పామూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రం



రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిచిన వాహనాలు

పామూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్ర తరం అవుతున్నది. రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలపై కట్టడాలను పంచాయతీ అధికారులు తొలగించినా పరిస్థితిలో మార్పులేదు. ఆక్రమణలు తొలగించి మూడు నెలలు గడవ కముందే మళ్లీ యథాస్థితికి వచ్చారు. మురుగు కాలువలపై షాపుల నిర్వహకులు సిమెంట్‌తో రాళ్లు వేయించు కొని వాటిపై బండ్లు పెట్టుకోవడంతో ఆక్రమణలు మళ్లీ మొదటికివచ్చాయి. దాంతో పాత బస్టాండ్, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డు, కందుకూరు రోడ్డులో ఎదురె దురుగా బస్సులు వస్తే అంతేసంగతులు. గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచిపోవాల్సిందే. షాపుల నిర్వాహకులు తమ దుకాణాల ముందు రోడ్డు స్థలంలో రేకుల షెడ్డులు ఏర్పాటు చేసుకొని అద్దెలకు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు.

సీఎస్‌పురం, విరువూరు రోడ్డు సెంటర్‌లో ఆక్రమణలు పెరిగిపోవడంతో ఒక వాహనం ఆగితేనే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఉదయం పూట మమ్మిడాడి సెంటర్‌వద్ద పోలీసులు ఉంటున్నా ట్రాఫిక్ ట్రాఫిక్ స మస్య పరిష్కారం కావడంలేదు. పంచాయతీ పాలకులు, ఆయాశాఖల అధికారులు సంయుక్తంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు గుంతలమయమైన రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దర్శి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు దర్శి ప్రాంతంలో రోడ్లు ఛిద్రమై అధ్వానంగా మారాయి. భూమిలో తేమ అధికమై పొంగటంతో పలురోడ్లలో పెద్ద గుంతలు పడ్డాయి.



దర్శి-పొదిలి రోడ్డులో కాటేరు వాగు చప్టాపై కూలిపోయిన దిమ్మెలు



పతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు దుస్థితి

దర్శి-పోతవరం రోడ్డు అనేక చోట్ల గుంతలుపడటంతో పాటు రోడ్డు మార్జిన్‌లు కోసుకుపోయాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తొలిగే వీలులేకుండాపోయింది. గుంతల్లో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దర్శి- పొదిలి రోడ్డులో కాలేరు వాగుపై సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన చప్టా బలహీనపడి కూలేదశకు చేరింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తరుచూ కాటేరు వాగు పొంగుతున్నది. దీంతో చప్టా ఇరువైపులా ఉన్న దిమ్మెలు కూలిపోయాయి. చప్టా సామర్థ్యం కూడా పూర్తిగా తగ్గిపోయి ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదముంది. పతకమూరు- పాపిరెడ్డిపాలెం రోడ్డు వర్షాలకు ఛిద్రమైంది. గుంతల్లో వర్షపునీరు నిలబడి వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి-సామంతపూడి రోడ్డు పలుచోట్ల దెబ్బతినటంతో పాటు రోడ్డు మార్జిన్ కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు రోడ్ల దుస్థితిని గుర్తించి అత్యవసర మరమ్మతులు చేంయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

దర్శి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తున్నారని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం ఓప్రకటన విడుదలచేశారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కోటి సంతకాల పేరుతో వైసీపీ బోగస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ హయాంలో వైద్యకళాశాలల నిర్మాణాలకు ఒక్కపైసా కూడా వెచ్చించలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ప్రజాప్రభుత్వం అభివృద్ధిపథంలో దూసుకెళుతుందన్నారు. జగన్ అండ్ బ్యాచ్‌కు ఏమీ చేయాలో దిక్కుతోచక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. గతఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా వైసీపీకి సిగ్గురాలేదన్నారు. భవిష్యత్తులో ఆపార్టీకి ప్రజలు మరింత గుణపాఠం చెబుతారన్నారు.

పులిపాడు చెరువు నీరు విడుదల

ముండ్లమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు చెరువుకు పుష్కలంగా నీరు చేరి నిండి ప్రమాదం పొంచిఉండటంతో ఇరిగేషన్ అధికారులు చెరువు గేట్లు ఎత్తి అలుగు ద్వారా చిలకలేరు వాగుకు ఆదివారం నీటిని విడుదల చేశారు. జేఈ ఎం.సుబ్బారావు పర్యవేక్షించారు. అలుగు చిల్ల చెట్లతో మూసుకుపోవటంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, ఏరేసు వెంకటేశ్వరరెడ్డి, రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు రైతు నేస్తం అవార్డు



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వేణుగోపాల్

ముండ్లమూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని శ్రీసాయిబాబా వెజిటబుల్ నర్సరీ అధినేత నలబోతు వేణుగోపాల్ ఆదివారం హైదరాబాద్‌లో రైతు నేస్తం పురస్కారంను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అందుకుంటున్నారు. శంషాబాద్ సమీపంలోని ముంచితలలో ఉన్న స్వర్ణభారతి ట్రస్ట్‌లో రైతు నేస్తం పురస్కారాలను అందజేశారు. ఈసందర్భంగా వేణుగోపాల్‌ను వెంకయ్యనాయుడు, తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించి మెమొంటోను, అవార్డును అందజేశారు.

సమాచార వ్యవస్థను పెంపొందించుకోవాలి

పీసీపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్టేషన్‌కు సమాచారం అందేలా సమాచార వ్యవస్థను పెంపొందించుకోవాలని కనిగిరి సీఐ షేక్ ఖాజావలి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. కేసుల దర్యాప్తులకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసిన ఆయన ఎస్ఐ కోటయ్యకు పలు సూచనలు చేశారు.

గుంటిగంగలో కార్తీకమాస సత్యనారాయణ వ్రతాలు

తాళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగ సన్నిధిలోని గుంటిగంగ బ్రాహ్మణ సత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. బ్రాహ్మణసత్రం అధ్యక్షురాలు యల్లాప్రగడ లక్ష్మీ సుందరి, మండల బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా సామూహిక వనభోజన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సత్రం కమిటీ బాధ్యులు వై.కన్నయ్య, ఆర్‌వై కోటేశ్వరరావు, నరసింహారావు, వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామివార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం గోశాలలోని గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు, టీడీపీ నాయకులు మన్నెపల్లి రవికుమార్, తోట నారాయణ, మన్నేపల్లి సురేష్, సంగిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వరస్వామిని దర్శించుకున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దంపతులు



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు శ్రీకృష్ణుని చిత్రపటాన్ని అందజేస్తున్న ధర్మకర్త సుబ్బారావు తదితరులు

దొనకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దొనకొండ సమీపాన గల పెద్దన్న చెరువు కట్టపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారికి ఆలయ ధర్మకర్త చిన్నబోయిన సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, నాగులపాటి శివకోటేశ్వరరావులు శ్రీకృష్ణుని చిత్రపటాన్ని అందజేశారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జయలక్ష్మి



తహసీల్దార్ జయలక్ష్మికి బొకే అందజేస్తున్న ఆర్ఐ సుధాకర్, వీఆర్వోలు

కనిగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కనిగిరి తహసీల్దార్‌గా నర్రా జయలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఏరవి శంకర్‌పై పలు ఆరోపణలు రావటంతో జిల్లా కలెక్టర్ విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈనేపథ్యంలో చీమ కుర్తిలోని ఎంఎల్ఎస్ పాయింట్ డీటీగా పనిచేస్తున్న జయలక్ష్మికి పదోన్నతి కల్పించి కనిగిరి తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఈసందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ నిబంధనలను అనుసరించి విధులు నిర్వర్తిస్తామన్నారు. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది, అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు ఆర్ఐ సుధాకర్ పూలబొకేను అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రసాద్, వీఆర్వోలు లు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, సిరాజ్, రాజశేఖరరెడ్డి, నిర్మల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
సోమవారం 27 అక్టోబరు 2025





సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, జేసీ భావన వశిష్ట

నేటి మధ్యాహ్నం నుంచి ప్రభావం

బాపట్ల, రేపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రేపల్లెలోని పునరావస కేంద్రాలను ఆదివారం కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం నుంచి తుఫాన్ ప్రభావం ఉండ వచ్చని, రాత్రికి ఈదురుగాలులతో కూడిన వర్షం పడే పరిస్థితి ఉందన్నారు. తుఫాన్‌ను ఎదు ర్కొనేందుకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రజలు తక్షణమే కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. ప్రజలు కావాల్సిన నిత్యావసర వస్తువులను కొంతమేర ముందస్తుగా తీసుకుని ఉంచుకోవాలని సూచించారు.

అధికారులు సిద్ధంగా ఉండాలి : ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డి

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి ఎం. వేణుగోపాలరెడ్డి అధికారులను ఆదేశించారు. తుఫాన్ జాగ్రత్తలపై ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్, జేసీ భావన వశిష్ఠలతో కలిసి సమీక్షించారు. తుఫాన్ ఏ సమయంలో ఎలా మారుతుందో తెలియదని, దానికి తగ్గట్టుగా అధికారులందరు సిద్ధంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు సురక్షితంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

మొంథా.. అలర్ట్

తుఫాన్‌పై హెచ్చరికలు జారీ

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఎక్కడికక్కడ ఏర్పాట్లతో సర్వం సన్నద్ధం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు
- పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు
- భారీ వర్షాలపై హెచ్చరికలతో ఆందోళనలో రైతులు
- రెడ్ అలెర్టు.. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం



రేపల్లె : 3వవార్డు మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తహసీల్దార్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, రేపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుఫాన్‌పై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సర్వం సిద్ధమయ్యారు. ఎక్కడికక్కడ ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడు రోజులు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మండల, గ్రామ స్థాయిల్లో కూడా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎటువంటి పరిస్థితి నెలకొన్నా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని, నదీ తీర ప్రాంత, లంక గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. మొంథా తీవ్రత ఏ స్థాయిలో ఉన్నప్పటికీ సమర్థంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నారు. జలవనరులు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, వ్యవసాయ, రవాణా, విద్యుత్, మత్స్య శాఖలను అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే ఇళ్ల నుంచి బయటకు రావాలని అధికారులు సూచించారు. మొత్తం మీద తుఫాన్ సంబంధించి ముందస్తు చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. వాయుగుండం ప్రభావంతో జిల్లాలో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. మొంథా తుపాను తరుముకు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే చేపట్టాల్సి ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులు పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తు న్నారు. ప్రధానంగా పర్చూరు నియోజకవర్గంలో పొలాల్లోనూ, ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన పొగాకు బేళ్ల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరును వర్షం బారి నుంచి తక్కువ నష్టంతో కాపాడుకోవడానికి అన్నదాతలు చెమటోడుస్తున్నారు.

మండలాల వారీగా ప్రత్యేక అధికారులు

ముంచుకొస్తున్న తుఫాన్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవడానికి మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. వారు నిర్వహించాల్సిన విధులపై కలెక్టర్ వినోద్ కుమార్ మార్గని ర్దేశనం చేశా రు. తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లాకు ప్రత్యే క అధికారిగా వేణుగోపాల్‌రెడ్డిని ప్రభుత్వం నియ మించింది. జోనల్ ఇన్‌చార్జిగా ఐఏఎస్ అధికారి ఆర్పీ సిసోడియా వ్యవహరించనున్నారు. వీరు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దనే ఆదేశాలతో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఇప్పటికే తీర ప్రాంత గ్రామాల వద్ద మొహరించింది.

మూడు రోజులు విద్యాసంస్థలకు సెలవు

అతి భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవులు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు, కళాశాలలకు మూడు రోజులు సెలవు ఇవ్వాలన్నారు. తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఉద్యోగులకు సెలవులు రద్దు...

జిల్లా స్థాయి అధికారులు మొదలు, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది అందరికీ సోమవారం నుంచి మూడు రోజులు సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వారికి కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం లేకుండా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. డివిజన్ల వారీగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేసి ఆర్డీవోలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ రద్దు చేశారు.

సముద్రస్నానాలకు రావద్దు..

కార్తీకమాసం పవిత్రస్నానాలకు మూడు రోజుల పాటు సముద్రతీర ప్రాంతాలకు భక్తులెవరూ రావద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీచ్‌ల వద్ద నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు. పర్యాటకులు తీర ప్రాంత ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. భక్తులతో పాటు పర్యాటకులు కూడా సహకరించాలని ఎస్పీ ఉమామహేశ్వర్ కోరారు.



హార్బర్‌లో కొనసాగుతున్న హెచ్చరిక

నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం కూడా ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని పోర్టు అధికారులు సూచించారు. సముద్రం అంచున నివశించే మత్స్యకారులు పునరావసకేంద్రాలు, తుఫాన్‌షెల్టర్లలోకి వెళ్లాలని సూచించారు. జెట్టీల్లోని బోట్లు, పడవలు కొట్టుకుని వెళ్లకుండా భద్రత చేసుకోవాలని సూచించారు.



పెదకాకాని శివాలయంలో నెలకొన్న భక్తుల రద్దీ

కార్తీక సందడి

- ఆలయాల్లో భక్తుల దీపారాధనలు
- అమరారామం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు

అమరావతి, పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలను వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి ముందు భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఉచిత దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయంలో తీర్థప్రసాదాలు అందలేదు. ప్రశ్నించిన భక్తులపై అర్చకులు దురుసుగా సమాధానం చెప్పడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తులు యజ్ఞాలబావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రదక్షిణలు చేసి దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ నిత్య అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి మేధాదక్షిణామూర్తి మాలధారణ

నరసరావుపేట రూరల్: మేధా దక్షిణామూర్తి క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ప్రథమ కార్తీక సోమవారం నుంచి మేధా దక్షిణామూర్తి మాలధారణ మండల దీక్ష కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక అధికారి చంద్రశేఖర రావు తెలిపారు. డిసెంబరు 6న త్రికోటేశ్వరస్వామికి ఆరుద్రోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండల దీక్ష తీసుకునే భక్తులు సోమ, మంగళవారాల్లో దీక్ష చేపట్టాలని సూచించారు. అర్ధ మండల దీక్ష తీసుకునేవారు నవంబరు 14, 15 దీక్ష చేపట్టాలని తెలిపారు.



అమరావతి : కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

ఉపాధి అవకతవకలపై వేటు

- ఐదుగుర్ని సస్పెండ్ చేస్తూ పీడీ ఉత్తర్వులు
- బల్లికురవ మండలంలో పనుల్లో లోపాలు గుర్తింపు
- రూ.3 కోట్ల అక్రమాలు.. రూ.2 కోట్ల రికవరీకి ఆదేశాలు
- గతంలో ఇద్దరిపై చర్యలు.. 12 మందికి నోటీసులు జారీ

బల్లికురవ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు గుర్తించగా అందుకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. ఐదుగురు ఉపాధి సిబ్బందిని సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ విజయలక్ష్మి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గత ఏడాదిలో సుమారు రూ.12 కోట్లతో పనులు జరిగాయి., ఇందుకు సంబంధించి ఆగస్టులో సామాజిక తనిఖీ బృందాలు ఆయా గ్రామాల్లో తనిఖీలు చేపట్టి పనుల నాణ్యతను పరిశీలించాయి. రూ.3 కోట్ల మేర పనుల్లో లోపాలను అధికారులు గుర్తించారు. బోగస్ మస్టర్లు ఉన్నాయని, పనుల కొలతల్లో తేడాలు ఉన్నాయని, కొన్ని దగ్గర్ల పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించారని, ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు ఉపాధి కూలీలుగా పేర్లు నమోదు చేశారని ప్రజా వేదికలో తేల్చారు. రెండు రోజుల పాటు ప్రజా వేదిక సభ నిర్వహించి పనుల్లో లోపాలను అధికారులు పరిశీలన చేశారు. దీనిపై పీడీ పరిశీలన చేసి పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు క్షేత్ర సహాయకులను విధుల నుంచి తొలగించారు. మరో 12 మంది క్షేత్ర సహాయకులకు గత వారం నోటీసులు జారీ చేశారు. ఇంకా పనులు చేయించిన ఉపాధి సిబ్బందిపై రెండోసారి చర్యలకు ఫైల్ పెట్టారు. ఇన్‌చార్జి ఏపీవో జి.రమాదేవి, టీఏలు జి.లచ్చిబాబు, పి.నాగరాజు, శేషయ్య, సీవో రాములను సస్పెం డ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసి మండల పరిషత్ కార్యాలయానికి మెయిల్ చేశారు. వచ్చే నెల 18 లోపు పనులకు సంబంధించి ఆధారాలు ఉంటే సమర్పించాలని సస్పెండ్ అయిన ఉద్యో గులకు జిల్లా అధికారులు అవకాశం ఇచ్చారు. సుమారు రూ.2 కోట్ల మేర రికవరీకి ఆదేశించారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

అంతులేని అక్రమాలపై ఆగ్రహం

ఒక్క మండలంలోనే ఇంతమందిపై వేయడంతో ఉపాధి అక్రమాలు అంతులేకుండా జరిగాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.కోట్లలో అక్రమాలను గుర్తించడం.. ఏడుగురిపై వేటు వేయడం, 12 మందికి నోటీసులు జారీ చేయడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎంతమేర అక్రమాలు జరిగి ఉంటాయోనంటున్నారు. గతంలో ఉపాధి పనుల పరిశీలనలు, సామాజిక తనిఖీలు సక్రమంగా చేపట్టకపోవడంతోనే పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూడలేదంటున్నారు.

స్వగ్రామానికి చేరిన ధాత్రి శరీర భాగాలు

- బోరున విలపించిన కుటుంబసభ్యులు
- పరామర్శించిన హైకోర్టు జడ్జి జస్టిస్ రామకృష్ణ

ఇంకొల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో సజీవ దహనమైన ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన గన్నమనేని ధాత్రి శరీర భాగాలు ఆదివారం రాత్రి 9.30 గంటలకు స్వగ్రామానికి చేరాయి. కర్నూలు నుంచి ప్రత్యేక వాహనంలో వాటిని అక్కడి అధికారులు ఇక్కడికి పంపారు. కుటుంబసభ్యులు ధాత్రి శరీరభాగాల ముద్దలను చూసి బోరున విలపించారు. కనీసం చూడడానికి రూపం లేకపోయిందని తల్లి వాణి బోరున విలపించారు. ఈ ఘటనతో పూసపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ధాత్రి తాతయ్య అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ఆదివారం పూసపాడుకు చేరుకుని కుటుంబ సభ్యులకు ఓదార్చారు.



ధాత్రి శరీర భాగాలను తీసుకువచ్చిన పేటిక వద్ద విలపిస్తున్న తల్లి వాణి

16 నెలల్లో రూ.5.1 కోట్లు మంజూరు

- ముఖ్యమంత్రి సహాయ నిధితో రోగులకు ఆసరా
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పదహారు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ.5.1 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు చెందిన 25 మందికి ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 677 మందికి లబ్ధి చేకూరినట్లు తెలిపారు. వివిధ ఆరోగ్య సమస్యలతో పాటు ప్రమాదాలకు గురైన పేద వర్గాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఇప్పటి వరకు చుండూరు మండలంలో రూ.1,09,52,005, అమృతలూరు మండలంలో రూ.1,03,96,191, వేమూరు మండలంలో రూ.90,11,068, కొల్లూరు మండలంలో రూ.97,10,856, భట్టిప్రోలు మండలంలో రూ.1,17,28,019 ముఖ్యమంత్రి సహాయ నిధి రూపంలో బాధిత కుటుంబాలకు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టీడీపీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు, మైనేని మురళీకృష్ణ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరి పుణ్యశ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనరావు, నాయకులు డొక్కు శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మొంథా తుపానుపై రైల్వే సన్నద్ధత ఏదీ?

- ఇప్పటి వరకు ఏర్పాటు చేయని హెల్ప్‌లైన్ నంబర్లు

చీరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకపక్క మొంథా తుపాను సముద్ర తీరానికి కదులుతోందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ.. రైల్వే శాఖ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్ట లేదు. కనీసం హెల్ప్‌లైన్ నంబర్లు కూడా ప్రకటించ లేదు. తుపాను ప్రభావం ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ.. ప్రతిస్పందనగా రైల్వే శాఖ నుంచి ఎలాంటి బులెటిన్‌లు కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదు. మొంథా తుపాను కాకినాడ వద్ద తీరం దాటొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను వల్ల గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అలానే 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. గతంలో వచ్చిన తుపాన్లు కంటే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని కూడా హెచ్చరిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదివారం సాయంత్రం వరకు డివిజన్ కార్యాలయాలకు ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాచారం. ఐఎండీ చెబుతున్నట్లు భారీ వర్షాలు కురిస్తే రైల్వేస్టేషన్లు, రైలు మార్గాల్లోకి వర్షం నీరు చేరి నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. వాగుల్లో నీటి ప్రవాహాలు పెరిగి రైలు మార్గాలు దెబ్బతినే అవకాశాలుంటాయి. దీంతో రైలు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ముందస్తు సమాచారం లేకుండా రైళ్ల రద్దు, దారి మళ్లింపులు చేస్తే ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. విశాఖపట్నం - చెన్నై మార్గం అత్యంత రద్దీ రూట్లలో ఒకటిగా ఉంది. ఈ మార్గంలో గుంటూరు నుంచి విశాఖపట్టణం వైపునకు నిత్యం ఫలక్‌నుమా, జన్మభూమి, విశాఖ, ప్రశాంతి, అమరావతి(షాలిమార్), ఉదయ్, సింహాద్రి వంటి రెగ్యులర్ రైళ్లు ప్రయాణిస్తాయి. చెన్నై మార్గంలో నిత్యం చెన్నై, జనశతాబ్ది, వందేభారత్, నారాయణాద్రి, శబరి ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో మొంథా తుపానుని రైల్వే శాఖ తేలికగా తీసుకోకుండా తగిన సన్నద్ధత చర్యలు చేపట్టాలని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు కోరుతున్నారు.

జేఆర్ఎఫ్ ప్రవేశ పరీక్షలో.. వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



జీఎస్ రంగనాథ్, 2వ ర్యాంక్



వి.ప్రత్యూష, 43వ ర్యాంక్



జి.బృహతి, 20వ ర్యాంక్

బాపట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీఏఆర్- ఏఐఈఈఏ జాతీయ స్థాయి పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ (ఆనర్స్ ఏజీ) 2021బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. జీఎస్.రంగనాథ్.. ప్లాంట్ సైన్సెస్‌లో అఖిలభారత స్థాయిలో 2వ ర్యాంక్, వి.ప్రత్యూష ప్లాంట్ సైన్సెస్‌లో 43, మేడపాటి జీఎస్.సాహితి ప్లాంట్ బయోటెక్నాలజీలో 1, పి.హంస్సేన్‌ఖాన్ ప్లాంట్ బయోటెక్నాలజీలో 38, జి.బృహతి ఫిజికల్ సైన్సెస్‌లో 20, కె.మహిమ 161వ ర్యాంక్ సాధించారని వెల్లడించారు. అదేవిదంగా ప్లాంట్ సైన్సెస్, ఎంటమాలజీ, అగ్రానమిలో అనేక మంది విద్యార్థులు 10 నుంచి 50 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ప్లాంట్ సైన్సెస్‌లో 20మంది విద్యార్థులు అర్హత సాధించగా ఎంటమాలజీలో 14, అగ్రానమిలో 13, ప్లాంట్ బయోటెక్నాలజీలో ముగ్గురు, సోషల్ సైన్సెస్‌లో ఇద్దరు, ఫిజికల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్‌లో జాతీయ స్థాయిలో 200 నుంచి 900 వరకు ర్యాంకులు సాధించి భారతదేశంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాలైన ఐఏఆర్ఐ న్యూఢిల్లీ, ఐఏఆర్ఐ రాంచి, ఐజీకేవీ చత్తీస్‌ఘడ్, రాయపూర్, టీఎన్ఏయూ కోయంబత్తూరు, ఐవీఆర్ఐ ఉత్తరప్రదేశ్, యూ ఏఎస్ ధార్వాడ్, ఎస్కే యూఎస్టీ కశ్మీర్‌లో సీట్లు పొందినట్లు ఆమె తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులను ఆమె అభినందించారు.

అవీ..ఇవీ..

ట్రావెల్స్ యజమానులు తప్పనిసరిగా నిబంధలను పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

ఇంకొల్లు, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్ యజమానులు, సిబ్బం ది తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలను పాటించాలని, ఇంకొల్లు సర్కిల్ సీఐ వై.వీ. రమణయ్య సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఇంకొల్లు మండలంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణీకులను తరలిస్తున్న ప్రైవేటు బస్సు ట్రావెల్‌కు సంబంధించిన యజమానులు, సిబ్బందికి రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కలిగించారు. రోడ్డు ప్రమాదాల దృష్ట్యా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి రోజు డ్రైవర్లకు ఆల్కహాల్ పరీక్ష తప్పనిసరని, హెవీ లైసెన్సు కలిగిన వారిని మాత్రమే డ్రైవర్‌గా నియమించాలన్నారు. అర్ధరాత్రి వేళలలో పోలీసులు చేపట్టే ఫేస్‌వాష్ కార్యక్రమానికి సహకరించి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించాలని సూచించారు. ఇంకొల్లు ఎస్సై సురేష్ మాట్లాడుతూ మార్గమధ్యంలో ఎటువంటి అవాంతరాలు ఎదురైనా 112, 100 నంబర్లకు, స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

సీపీడబ్ల్యూ స్కీంల ద్వారా ప్రజలకు తాగునీరు


వైదనలో రక్షిత మంచి నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు

బల్లికురవ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో సీపీడబ్ల్యూ స్కీంల ద్వారా ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం. అనంతరాజు తెలిపారు. మండలంలోని వైదన గ్రామంలో ఉన్న రక్షిత మంచి నీటి పథకాన్ని ఎస్ఈ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకాల ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా జలజీవన్ మిషన్ ద్వారా ప్రత్యేక పైపులైన్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ప్రజలకు శుద్ధి చేసిన నీటిని మాత్రమే విడుదల చేయాలన్నారు. ఎక్కడ లోపాలు లేకుండా స్కీంలను వినియెగంలోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అలానే మొంథాన్ తుపాను ప్రభావంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ట్యాంకులను నీటిని నింపాలన్నారు. గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ పరిశీలనలో తెలుగు యువత మండల నాయకులు పోగుల చంద్రశేఖర్, ఏఈ గిరినాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్‌డీగా సత్యనారాయణకు ఉద్యోగోన్నతి

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఇన్‌చార్జ్ ఈవోఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న కొసనా సత్యనారాయణకు ఈవోఆర్‌డీగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయన్ను ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ విధి నిర్వహణలో సత్యనారాయణ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో అధి కారులు అప్రమత్తంగా ఉండాలని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న అన్నారు. ప్రజల భద్రతకు సంబంధించి కలె క్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణహాని జరగ కుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఏమైనా సమస్య వస్తే అందుబాటులో ఉండే విధంగా వసతి గృహాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎస్సై జీవి. చౌదరి, ఈవోఆర్‌డీ సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడు మృతి


మాధవరావు (ఫైల్)

ఈపూరుపాలెం (చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలేనికి చెందిన మాజీ సైనికుడు కొమ్మనబోయిన మాధవరావు మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఆయన పార్ధీవ దేహంపై మువ్వన్నెల జెండాకప్పి నివాళులు అర్పించారు. మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి మనోధైర్యాన్ని చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యక్షులు వెంకటకృష్ణారావు, సెక్రటరీ మొయినుద్దీన్, ట్రెజరర్ యల్లమంద, తదతరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

● పరీక్షలకు 1,224 మంది హాజరు

వాడరేవు(చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని వాడరేవు రామానంద ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. 1224 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వేకువజాము నుంచే ప్రారంభమైన కార్యక్రమానికి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మేనేజర్ నారాయణం సురేష్ పలు జాగ్రత్తలు చేపట్టారు. శిబిరంలో డా.రాజరాజేశ్వరీ, డా.కమలా రాజేశ్వరీ, డా.లలిత్ ప్రకాష్, డా.పేట శ్రీకాంత్, డా.ప్రకాష్ హాజరయి పరీక్షలు నిర్వహించారు.

పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధి


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానాభివృద్ధితోపాటు ఏకాగ్రత మెరుగుపడుతోందని, అద్దంకి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా ఆదివారం స్థానిక కమటేశ్వర ఆలయంలో విద్యార్థులతో దిన పత్రికలు, చెకుముకి, మ్యాగజైన్స్, నీతి కధలు చదివించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు సుగుణరావు, కావూరి రఘుచంద్, తంగా శ్రీనివాసరావు, జ్యోతి రమేష్, ఎర్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుల్లో కలవరం

● ఇప్పటికే వర్షాలు గాలులకు పడిపోయిన పైరు
● తుపాను హెచ్చరికతో మరింత నష్టపోతామని ఆందోళన


మార్టూరు మండలం వలపర్లలో పడిపోయిన మొక్కజొన్న పైరు

మార్టూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో మండలంలో మొక్కజొన్న పంట సాగుచేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షం కన్నా భారీ గాలులు వీచినట్లయితే పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మండలంలో 360 ఎకరాలు మొక్కజొన్న సాగు చేశారు. మూడు నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు తాను సాగు చేసిన 7 ఎకరాలు మొక్కజొన్న పంట నేలకు ఆనినట్లు రైతు తన్నీరు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇకప్రస్తుతం తుఫాను ప్రభావంతో మరింతగా గాలులుతో కూడిన వర్షం కురిస్తే పంట పూర్తిగా నేలపాలవుతుందని ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం నుండి తుఫాను ప్రభావం వ్యాపించే అవకాశం ఉండడంతో మరింతగా ఈ పంటలు దెబ్బతినే అవకాశం ఉంది.

కూరగాయల పంటలకు నష్టం

మండలంలో కూరగాయల పంటలు సాగుచేసిన రైతులు మూడురోజుల క్రితం కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలోని బొల్లాపల్లి, వలపర్లలో 500 ఎకరాల్లో కూరగాయలు సాగయ్యాయి.

యద్దనపూడి మండలంలో

యద్దనపూడి మండలంలో తుఫాను ప్రభావాన్ని ఎదొర్కొనేందుకు మండల అధికారం యంత్రాంగం చర్యలు చేపట్టింది. తహసీల్దారు కే.రవికుమార్, ఎంపీడీవో, విద్యుత్ ఏఈ, ఆర్‌డబ్లుఎస్ అధికారులు ఆదివారం తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా రూపాంతరం చెందుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రేణంగివరం ఎస్.ఐ.వినోద్‌బాబు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఇంటిలోనే ఉండాలని, బయటకు వెళ్ళవద్దని సూచించారు. విద్యుత్ పరికరాల వినియోగం నిలిపివేయడంతో పాటు తాగునీరు, నిత్యావసరాలు ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. చెట్లకింద, విద్యుత్‌తీగల సమీపంలో నిలువరాదని కోరారు. ప్రభుత్వ సూచనలను విధిగా పాటించాలన్నారు.

వాడరేవు(చీరాల) : మొంథా తుఫాన్ ప్రభావంతో ఎటువంటి నష్టం వాటిల్లకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. ఇప్పటికే వాతావరణశాఖ భారీ తుఫాన్ సూచించిన నేపథ్యంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఆదివారం పాయింట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విపత్కర సమయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. వేటకు నిషేదాజ్ఞలు విధించినట్లు చెప్పారు. వారి వెంట డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎస్సై జనార్ధన్ ఇతర సిబ్బంది ఉన్నారు.

బల్లికురవ : మొంథా తుపానుపై గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వి. వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయం, ప్రాథమిక వైద్యశాలలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా జనరేటర్ సౌకర్యం కల్పించాలన్నారు. అలానే వాగులు వంకలు వచ్చే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఎవరైన లోతట్టు ప్రాంతంలో ఉంటే వారిని పునరావస కేంద్రాలకు తరించాలన్నారు. మూడు రోజుల పాటు తుపాను ప్రభావం ఉంటుందన్నారు. అన్ని గ్రామాలలో ప్రజలకు దండోరా ద్వారా తుపానుపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులు అందరు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, ఆర్‌అడబ్ల్యూఎస్, గృహనిర్మాణ శాఖ ఏఈలు, గిరినాయక్, దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: మొంథా తుపాను ప్రభావంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఖరీఫ్ పంటలు చేతికందే సమయంలో తుపాను రావడంతో ఈ ప్రభావం ఎంతవరకు ఉంటుందో అని వారు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు దేవుడిపై భారం వేసి పంటల వైపు చూస్తున్నారు. బల్లికురవ మండలంలోని చెన్నుపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, కొమ్మినేనివారి పాలెం, వైదన, ముక్తేశ్వరం గ్రామాలలో రైతులు మొక్కజొన్న, సజ్జ పంటలను సాగు చేశారు. ఇప్పుడు కొందరు రైతులు సాగు చేసిన పంట కోత దశలో ఉండగా కొందరికి కండే దశలో ఉన్నాయి. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు లబోదిబో మంటున్నారు. అలానే పలు గ్రామాలలో రైతులు పత్తి, మిర్చి బొప్పాయి, కూరగాయాల పంటలను సాగు చేసి ఉన్నారు. ఈ పంటలు కూడా వర్షాలకు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మరో మూడు రోజుల పాటు రైతులు దినదిన గండంగా పంట పొలాలవైపు చూస్తున్నారు.

తుపాను షెల్టర్లుగా 18 కేంద్రాల ఏర్పాటు

మార్టూరు : మొంథా తుపాను ప్రభావంతో మండలంలోని గ్రామాలలో ఇబ్బందులు పడే ప్రజానీకం కోసం 18 పునరావాస కేంద్రాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ టి.ప్రశాంతి ఆదివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 18 కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. వాటిలో ఆదివారం మార్టూరులోని జడ్పీ హైస్కూల్‌ను మండల ప్రత్యేకాధికారి బాషా, ఆర్ఐ అశోక్‌లు పరిశీలించారు. అదేవిధంగా సోమవారం ఉదయం నుంచి ఈ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. వాటిలో విద్యుత్, తాగునీరు తదితర వసతులను ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా అప్రమత్తంగా ఉండాలి

ఇంకొల్లు : ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ కారణంగా మండల పరిధిలోని అన్నీ గ్రామ పంచాయితీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులను సైతం అప్రమత్తం చేస్తామన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగుచర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బంది పారిశుధ్యం కార్మికులను అప్రమత్తంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అద్దంకిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అద్దంకి : మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోలు రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. అద్దంకి పట్టణ ప్రజలకు తుఫాన్ సమయంలో అవసరమైతే 9342929342ను సంప్రదించాలన్నారు.

మొంథా తుఫాన్ నేపధ్యంలో ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలన్నారు. స్తంభాలు పడినా, విద్యుత్ వైర్లు తెగినా తాకరాదన్నారు. వెంటనే కం ట్రోల్ రూమ్ 9490611613, టోల్‌ఫ్రీ నంబరు 1912 కు సమాచారం అందించాలన్నారు.




బల్లికురవలో సమీక్షిస్తున్న తహసీల్దార్, దెబ్బతిన్న మొక్కజొన్న పైరు, చీరాలలో రక్షణ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో

జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షిత నీరు

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
● మార్టూరు తండాలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

మార్టూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన మంచినీటిని తాగునీటిగా అందిస్తున్నామని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మార్టూరులోని తండాలో ఎఫర్ట్ ఏకం అమెరికా స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే మొదట వారికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. సాగర్ జలాలను రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. అయితే కొన్ని చోట్ల గ్రామాలలో ఆర్‌వో ప్లాంట్లు ప్రజలకు తాగునీటిని అందిస్తున్నాయన్నారు. తండాలో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఎఫర్ట్ సంస్థ సేవా కార్యక్రమాలను పలువురు ఆదర్శంగా తీసుకోవాలని, సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావును అభినందించారు. సంపాదించిన సొమ్ములో ఎంతో కొంత సమాజానికి, పేదలకు అందించడం ద్వారా జీవితానికి సంతృప్తి లభిస్తుందన్నారు. తరువాత తండాలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడు కాల్వలకు, కల్వర్టులను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు.

అరకు కాఫీ షాప్ ప్రారంభం

మార్టూరు కూడలి నుంచి రాజుపాలెం రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్డులో సెర్ప్, డీఆర్‌డీఏ సహకారంతో డ్వాక్రా మహిళ షేక్ షాజియా భాను ఏర్పాటుచేసిన అరకు కాఫీ షాపును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కాఫీని రుచి చూశారు. తరువాత ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలపడాలన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంతి చంద్రబాబు మహిళలకు కల్పిస్తున్న అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ రజాక్, కామినేని జనార్దన్, తాటి నాగేశ్వరరావు జంపని శ్రీను, కమ్మ శి వనాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, తొండెపు ఆదినారాయణ, గొట్టిపాటి వెంకట్రావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలి

● హోరిజోన్ పాఠశాల కార్యదర్శి రవికుమార్


హోరిజోన్ స్కూల్ విద్యార్థులు

వేటపాలెం (చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే లక్ష్యాలపై దృష్టిసారిస్తే జీవనగమనం సజావుగా సాగుతుందని, వేటపాలెం హోరిజోన్ పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.పి.రవి కుమార్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో హోరిజోన్ విద్యార్థులు సత్తా చాటి ప్రథమస్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈక్రమంలో ఆదివారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అద్దంకి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్కిడ్స్ స్కూల్‌లో హైదరాబాద్ ఆసియన్ వాస్కలర్ వైద్యశాల సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పాకనాటి మధుసూధన్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరెడ్డి, సుంకర శ్రీదేవి, పేరం సుధాకరరెడ్డి, గోనుగుంట శ్రీనివాసరావు, కిరణ్‌బాబు, లక్ష్మీనారాయణ, నరశింహారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో మృతదేహం లభ్యం

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం సమీపంలోని కూడలిలో ఉన్న నీటికుంటలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని సమీప గ్రామవాసులు గుర్తించి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్సై జీవీ.చౌదరి, ఎస్సై సురేష్‌రెడ్డి తమ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. పర్చూరు మండలానికి చెందిన ఓ వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడా..? మరే ఇతర కారణాలు అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

టీడీపీ మండల అధ్యక్షుడిగా మురళీమోహన్‌దాస్

ఏకగ్రీవంగా మండల కమిటీ ఎన్నిక


మురళీమోహన్‌దాస్, శ్రీనివాసరావు, రాజశేఖర్‌బాబు

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా చినకొత్తపల్లికి చెందిన మానం మురళీమోహన్‌దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కుంకుపాడుకు చెందిన గాలం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా చక్రాయపాలేనికి చెందిన గోగుల మూడి రాజశేఖరబాబు, కోశాధికారిగా గుడిపాటి శ్రీనివాసరావు(కొంగపాడు), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వడ్లమూడి జానకిరామయ్య (నాగులపాడు), తోట గోపి (కలవకూరు), తన్నీరు కాశీ శ్రీను (ధర్మవరం), కార్యదర్శులుగా చందలూరి రామాంజనేయులు (కొటికలపూడి), జినుగు కోటిరెడ్డి (శంఖవరప్పాడు), మురికిపూడి మరియదాసు (వెంపరాల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన నేతలు మాట్లాడుతూ పార్టీకి, ప్రభుత్వానికి వారిధిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

దేవదాయశాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

రీజనల్ జాయింట్ కమిషనర్ సూర్యచంద్రశేఖర్ ఆజాద్


సమీక్ష నిర్వహిస్తున్న సూర్యచంద్రశేఖర ఆజాద్

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని, దేవాదాయశాఖ తిరుపతి రీజియన్ జాయింట్ కమిషనర్ సూర్యచంద్రశేఖర ఆజాద్ అన్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాలలోని దేవాలయాల అధికారుల సమీక్ష సమావేశం ఆదివారం శింగరకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ ఆజాద్ మాట్లాడుతూ దేవదాయ శాఖ కు చెంది రెవెన్యూ రికార్డులలో నమోదు కాని భూములను వెంటనే నమోదు చేయించాలన్నారు. దేవాలయాలు, సంస్థల ప్రాపర్టీ రిజిష్టర్‌లు తయారు చేయడంపై సూచనలు చేశారు. మండలాల వారీగా దేవాలయాల భూములపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో గుంటూరు డిప్యూటీ కమిషనర్ కెబి శ్రీనివాసరావు, బాపట్ల, ప్రకాశం జిల్లాల దేవాదాయశాఖ అధికారులు పానకాలరావు, సూర్యప్రకాష్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, రెండు జిల్లాలలోని దేవాల యాల అధికారులు, మేనేజర్లు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రండి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ కార్యదర్శులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29వ తేదీ వరకు అధికారులకు కేటాయించిన విధులలో ఎలాంటి అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధనలక్ష్మి, పంచాయతీరాజ్ ఏ.ఈ డి.దాను, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


భార్యపై భర్త కత్తితో దాడి

పంగులూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) :భార్యపై భర్త కత్తితో దాడిచేసిన ఘటన ఆదివారం పంగులూరులో చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు పంగులూరుకు చెందిన దేవరకొండ రామాంజనేయులు మద్యం సేవించి భార్యతో తరచూ గొడవపడుతుంటాడు. ఆదివారం మద్యం సేవించిన రామాంజ.నేయులు భార్య కృష్ణవేణితో గొడవపడ్డాడు. ఆమెపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో గాయపడిన కృష్ణవేణిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకొనేలా పద్మజ రచనలు


పద్మజ దంపతులను సన్మానిస్తున్న మురళీ సుధాకరరావు

అద్దంకి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): కుందుర్తి స్వరాజ్యపద్మజ రచించిన 'పంకజం పదనిసలు' అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటాయని ప్రముఖ కవయిత్రి వసుధారాణి అన్నారు. అద్దంకి పట్టణంలోని కమతేశ్వరాలయంలో ఆదివారం జరిగిన సృజన సాహిత్య సమావేశంలో కుందుర్తి స్వరాజ్య పద్మజ, రామకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. పద్మజ రచించిన పలు కవితలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు చుండూరి మురళీసుధాకరరావు, రాఘవరెడ్డి, కొల్లా భువనేశ్వరి, డీవీఎం సత్యనారాయణ, అనిల్‌కుమార్‌సూరి, అన్నమనేని వెంకట్రావు నారాయణం బాలసుబ్రహ్మణ్యం, గాడేపల్లి దివాకర్‌దత్, సృజన అధ్యక్ష, కార్యదర్శులు సంకా బాబు, మలాది శ్రీనివాస రావు, షేక్ మహ్మద్‌రఫీ, ఇలపావులూరి శేషతల్పసాయి, లక్కరాజు శ్రీనివాసరావు, అద్దంకి లేవిప్రసాద్, జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, నిమ్మరాజు నాగేశ్వరరావు, మారుతీరావు, గార్లపాటి రామకృష్ణారావు, మన్నం త్రిమూర్తులు, షేక్ మస్తాన్, మారం కోటేశ్వరరావు, సీతారామ శాస్త్రి, గోవాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.



నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(విద్య): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం (నేడు) అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈవోలు హెడ్ క్వార్టర్స్‌లో ఉండి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, హెచ్ఎంలు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని డీఈవో బాలాజీరావు ఆదేశించారు. జూనియర్ కళాశాలలు కూడా కలెక్టర్ ఆదేశాలను తప్పక పాటించాలని ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు.

సోమశిలకు నిలకడగా వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద నిలకడగా సాగుతోంది. ఆదివారం ఉదయం 52,129 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, సాయంత్రానికి 51,237 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దిగువకు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 68.505 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు.

కండలేరులో అవుట్ ఫ్లో 4,400 క్యూసెక్కులు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.240 టీఎంసీలు ఉన్నదని ఏఈ అనీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1090 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 4400 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా ఉందన్నారు.

రాళ్లపాడు గేట్ల ఎత్తివేత

లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లను దశలవారీగా ఎత్తి మన్నేరుకు నీటిని విడుదల చేశారు. శనివారం అర్ధరాత్రి నీటిమట్టం 19.7 అడుగులకు చేరడంతో డీఈఈ ఎం వెంకటేశ్వర్లు, ఏఈఈ బీ మనోహర్, సిబ్బంది కొత్త స్పిల్‌వేలోని నాలుగు గేట్లను అడుగు మేర ఎత్తారు. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో తగ్గడంతో రెండు గేట్లను దించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, నీటి మట్టం 18.5 అడుగులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కాగా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. నీటినిల్వ గురించి డీఈఈ ఎం వెంకటేశ్వర్లును అడిగారు.

తగ్గిన పెన్నా వరద

సంగం : సంగం బ్యారేజ్‌కి వస్తున్న పెన్నా వరద ఆదివారం కాస్త తగ్గింది. 94 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహమే వస్తున్నది. దీంతో ప్రస్తుతం బ్యారేజ్ వద్ద నీటి మట్టం 11.6 అడుగులుగా ఉంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లే బ్యారేజ్ 79 గేట్లు ఎత్తి పెన్నాకి విడుదల చేస్తున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో నాలుగు గేట్లు ఎత్తి మన్నేరుకు విడుదల చేసిన నీరు



సంగం : రాకపోకలు స్తంభించిన వీర్లగుడిపాడు గ్రామస్థులతో చర్చిస్తున్న అధికారులు

ముంచుకొస్తున్న మొంథా

- నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- 144 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- సహాయక చర్యలకు రూ.2 కోట్లు విడుదల
- జిల్లా ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ యువరాజ్
- డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- నేడు విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి, తుఫాన్‌గా మారి రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. సోమ, మంగళవారాల్లో జిల్లాపై ఈ ప్రభావం తీవ్రంగా పడనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అలెర్ట్ చేసింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమీక్షిస్తున్నారు. జిల్లాలో 9 తీర ప్రాంత మండలాలు తుఫాన్ ప్రభావానికి ప్రభావితమయ్యే అవకాశమున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తీసుకెళ్లేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా 144 రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారానికి ఇబ్బంది లేకుండా 377 రేషన్ దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలానే 82 డీసెంట్రలైజ్డ్ రైతు బజార్లను కూడా ఏర్పాటు చేశారు. విజయ డెయిరీ ద్వారా అంతరాయం లేకుండా పాల సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

● విపత్తు బృందాల రాక

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నష్టనివారణకు ప్రభుత్వం రెండు విపత్తు నిర్వహణ బృందాలను జిల్లాకు పంపింది. ఒకటి ఎన్డీఆర్ఎఫ్ బృందం కాగా, మరొకటి ఎస్డీఆర్ఎఫ్ బృందం. వీటిని నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఉంచారు. ఇక తుఫాన్ సమయంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అధికార యంత్రాంగం.. వారంలో ప్రసవం జరిగే అవకాశమున్న 312 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించింది. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి పథకాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద పవర్ బ్యాకప్‌లను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా 800 వాటర్ ప్లాంట్లను సిద్ధంగా ఉంచారు. ఇక జాతీయ, రాష్ట్ర రహదారుల్లో 27 ప్రదేశాలు, రైల్వే మార్గాల్లో 16 ప్రదేశాలు వరదలకు దెబ్బతినే ప్రమాదముందని గుర్తించారు. ఒకవేళ అక్కడ వరద ప్రభావం ఉంటే అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పెన్నా పరివాహకంలో 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి అక్కడ పొర్లుకట్టలకు మరమ్మతులు చేస్తున్నారు. అలానే సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలోని 2100 మొబైల్ టవర్స్ దగ్గర పవర్ బ్యాకప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

● ప్రత్యేకాధికారిగా యువరాజ్

తుఫాన్ నేపథ్యంలో జిల్లాకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్ యువరాజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన సోమవారం నుంచి జిల్లాలో ఉంటూ తుఫాన్ నివారణ చర్యలను పర్యవేక్షించనున్నారు. కాగా జిల్లాలోని అన్ని మండలాలకు కలెక్టర్ ప్రత్యేకాధికారులను నియమించారు. వారంతా ఆయా మండల హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ నివారణ చర్యలను పర్యవేక్షించనున్నారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు కూడా రద్దు చేశారు. ఇక తుఫాన్ సమయంలో సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.2 కోట్ల నిధులను కేటాయించింది.

● కరేడు తీరాన్ని సందర్శించిన ఎస్పీ

ఉలవపాడు : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కరేడు తీర ప్రాంతాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం పరిశీలించారు. ముందస్తుగా చేపట్టిన సౌకర్యాలు, భద్రత విషయాలపై పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తీరం వెంట గట్టి నిఘా పెట్టాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అన్వర్ భాష, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై అంకమ్మ తదితరులు ఉన్నారు.



జలదంకి మండలం నేరెళ్లవాగు చప్టాపై నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, తదితరులు



తుఫాన్ ప్రభావిత కరేడు తీరప్రాంతంలో పర్యటించిన ఎస్పీ అజిత వేజెండ్ల, సిబ్బంది

డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

నెల్లూరు(హరనాథపురం) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో 0861-2331261, 79955 76699, కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం 76010 02776, నెల్లూరు ఆర్డీవో కార్యాలయం 98499 04061, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం 91009 48215, కావలి ఆర్డీవో కారాల్యయంలో 77022 67559 నంబర్లను వినియోగించుకోవాలని కోరారు.

'పునాస'కు వర్షాల దెబ్బ

- తోటల్లో నిలిచిన నీరు... కోతకు ఆటంకం
- చెట్లపైనే పండి, రాలిపోతున్న కాయలు
- నష్టాల ఊబిలో మామిడి రైతులు



రంగు మారిన పునాస మామిడి కాయలు

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో పునాస మామిడి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. చేతికి వచ్చిన పంట చెట్లకే పరిమితమైంది. ముందస్తుగా కాచిన కాయలు కోతకు వచ్చే క్రమంలో వారం నుంచి వర్షాలతో తోటల్లో నీళ్లు నిలిచి, కాయ కోతలకు ఆటంకం ఏర్పడింది. దీంతో కాయలు పక్వానికి వచ్చి పండి చెట్ల కిందే రాలిపోతున్నాయి. ఈనెల నుంచి జనవరి వరకు పూతలు, పిందెలు, ముందస్తుగా కాసిన కాయల కోతలతో పునాస మార్కెట్ కళకళలాడుతుంది. గత సీజన్‌లో బంగినపల్లి మామిడిలో భారీగా నష్టాలు చవిచూసిన రైతు, పునాస మామిడిలోనైనా ఆ నష్టాన్ని పూడ్చుకుందామనుకున్న ఆశలు వారి ఆశలను భారీ వర్షాలు చిదిమేశాయి.

● కోతకు అనుకూలించని వాతావరణం

అందుబాటులో ఉన్న నాణ్యమైన కాయలు కోసి మార్కెట్‌కు తరలిద్దామనుకుంటే వాతావరణం అనుకూలించడం లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇంతటితో ఆగిపోయి, ఒకటి రెండు రోజులు బాగా ఎండలు కాస్తే పునాస కోతలు మొదలు పెట్టుకోవచ్చని వారంటున్నారు. ఈ క్రమంలో మళ్లీ అల్పపీడనం హెచ్చరికతో నాలుగైదు రోజులు వర్షాలు తప్పవని అంటున్నారు. దీంతో భారీగా నష్టాలు చూడాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. కాగా భారీ వర్షాలకు చెట్లకు ఉన్న పూత తుడిచిపెట్టుకుపోతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● తగ్గిన ధరలు

ఏదో ఒక రకంగా కాయల కోతలు చేపట్టిన రైతుకు రేటు విషయంలో నిరాశే ఎదురైంది. వర్షాలకు కాయల రంగుమారి, నాణ్యత దెబ్బతినడంతో మార్కెట్‌లో రేటు పడిపోయింది. నాణ్యమైన కాయలను కిలో రూ.20 కొనుగోలు చేస్తుండగా, రంగు మారడంతో కిలో రూ.10 కొంటున్నట్లు రైతులు చెప్తున్నారు. కొన్ని తోటల్లో రవాణా సౌకర్యం కష్టతరంగా ఉన్నా, రైతు ప్రయాసపడి మార్కెట్‌కు కాయలు తరలిస్తున్నారు.



మామిడి తోటలో నిలిచిన నీళ్లు

ట్రావెల్స్ బస్సులో పొగలు

- భయాందోళనలతో ప్రయాణికుల కేకలు



పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనను మరువక ముందే.. పొదలకూరు మండలంలో శనివారం రాత్రి మరో ట్రావెల్స్ బస్సు ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. పొదలకూరు నుంచి శనివారం రాత్రి 11 గంటలకు 15 మంది ప్రయాణికులతో బెంగళూరు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు (మిగతా 5లో...)

నవీకరణకు అవకాశం

- విద్యార్థులకు ఆధార్ ఎంతో కీలకం ● పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు
- 30లోగా అప్‌డేట్ చేయించుకోవాలి



నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కీలకమైన ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోటీ పరీక్షలకు హాజరవ్వాలన్నా, ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా, ఇతర ఏ లబ్ధి పొందాలన్నా కూడా ఆధార్ నవీకరణ ఎంతో అవసరం. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఎదిగే విధానంలో వారి వేలిముద్రలు, ఇతర బయోమెట్రిక్ లక్షణాలు మారుతుంటాయి. ఆయా వివరాలను పక్కాగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్‌ను తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులంతా కూడా ఆధార్‌ను నవీకరించుకోవాలని పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈనెల 30లోగా ప్రతిఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపింది.

● పాఠశాలల్లో అవకాశం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్‌ను నవీకరిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకు చిన్నారులు ఆధార్ అప్‌డేట్ చేయాలన్నది నిబంధన. జిల్లాలో 5 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు 45,493 మంది, 15 ఏళ్ల పైబడినవారు 38,638 మంది కలిపి మొత్తం 84,131 మంది విద్యార్థులు ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంది. వీరికోసం జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లలో 85 ఆధార్ నవీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో వార్డు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సౌకర్యం కల్పించినప్పటికీ రోజుకు కొంతమంది మాత్రమే రావాలని, అది కూడా సచివాలయం పనివేళల్లో మాత్రమే చేస్తామని నిబంధన పెట్టారు. దీంతో అధికశాతం విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేకపోయారు. దీంతో ప్రభుత్వం పాఠశాలల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేసి, ఈనెల 30 నాటికి అప్‌డేట్ పూర్తి చేయాలని ఆదేశించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని 85 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. నవీకరణకు సిబ్బంది అందరూ సిద్ధంగా ఉంటారు. తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, పాన్‌కార్డులు తదితర గుర్తింపు కార్డులతో విద్యార్థులు హాజరు కావాలి. తప్పనిసరిగా నవీకరణ చేయించుకోవాలి. వర్షాలు కురుస్తూ ఉంటే గడువును మరికొన్ని రోజులు పొడిగించే అవకాశం ఉంది.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో

యూరియాపై నియంత్రణ

- విచ్చలవిడిగా వాడకానికి చెల్లుచీటి
- రబీలో కొరత తీరేనా..?
- రైతులందరికీ అందేనా...



అల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలో యూరియా వాడకంపై నియంత్రణకు అధికారులు సిద్ధమయ్యారు. తక్కువ ధరలో దొరుకుతుందని, యూరియాను ఎంత వినియోగిస్తే పైర్లు అంత బాగా ఎదుగుతాయనే భావనతో రైతులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహనా లోపంతో సీజను ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎకరానికి ఆరుబ్యాగుల (300 కిలోలు) యూరియాను వినియోగిస్తున్నారు. అది భూమిలో కరిగి మొక్కకు అందించేది కేవలం 60 నుంచి 80 కిలోల మాత్రమే. దీన్ని బట్టి యూ రియా అవసరానికంటే రెండు రెట్లు అధికంగా వినియోగిస్తుండగా, కొరత ఏర్పడుతున్నది. ఈ పరిస్థితిని గాడిలో పెట్టేందుకు అవసరమైన మేరకే యూరియాను వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అయితే ఈ సీజన్‌లో అవసరమైన మేరకు యూరియా అందేనా...అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

● యూరియా పంపిణీకి కార్డు


యూరియా పొందాలంటే అధికారులు పంపిణీ చేసే యూరియా పంపిణీ కార్డును పొందాలి. దీన్ని మండలాల వ్యవసాయాధికారుల వద్ద తీసుకోవాలి. దీని ద్వారా ఎకరానికి 3 బ్యాగులను మాత్రమే తీసుకునే వీలుంది. మూడు బ్యాగులు వినియోగిస్తే రబీ సీజనుకు సరిపోతుందని రైతులకు తెలిపేందుకు అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్డులో రైతు పేరు, ఆధార్ నెంబరు, సాగు విస్తీర్ణం వివరాలను పొందు పరుస్తారు. అందుకు అనుగుణంగా యూరియాను పొందవచ్చు. సొసైటీల్లో కానీ, డీలర్ల వద్ద కానీ ఈకార్డు ఉంటేనే యూరియా పొందే అవకాశం ఉంది. రబీ సీజనులో ప్రతీ 15 రోజులకోసారి యూరియా పొందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

● విస్తీర్ణానికి అనుగుణంగా నిల్వలు

ఒక్కొక్క మండలంలో ఎంత విస్తీర్ణంలో వరిసాగు చేపడుతున్నారనే గణాంకాలను బట్టి యూరియాను నిల్వ ఉంచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉదాహరణకు అల్లూరు మండలంలో 22 వేల ఎకరాలు ఉందనుకుంటే 66 వేల బస్తాలు మాత్రమే నిల్వ ఉంచేలా చూస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా 5 లక్షలు అనధికారికంగా వరిసాగు చేపడుతుంటే అందుకు అనుగుణంగా యూరియా నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

● రబీలో సమస్య తలెత్తనుందా...?

రబీలో యూరియా పంపిణీ సమస్యాత్మకం కానుందా... యూరియా కొరత ఏర్పడనుందా...? ఇలా అనేక అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. కొరత ఏర్పడకుంటే ఈ నిబంధనలు ఇప్పుడెందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ అనుమానాలను నివృత్తి చేయాలని వారు కోరుతున్నారు.



నూతన విధానంపై ఆందోళన



వరిసాగులో అత్యధికంగా యూరియా వినియోగం సర్వసాధారణం. నూతన విధానంపై ఆందోళనగా ఉంది. నియంత్రించేందుకు చేపట్టే ఈ చర్య రైతులకు సమస్యగా మారకుండా ఉండాలి.

- మోమిడి మాధవరావు, రైతు, అల్లూరు

నియంత్రిస్తే ఎలా...?



ఎకరాకు మూడు బ్యాగులు ఇస్తే సాగు ఎలా పూర్తవుతుంది. కాంప్లెక్స్ ఎరువులు ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో పేదరైతులు యూరియాపై ఆధారపడి సాగు చేస్తారు. పెద్ద రైతులకు పలుకుబడితో యూరియా ఇచ్చేసి పేద రైతులకు నిబంధనలు పెడితే ఎలా..?

- యరటపల్లి శేఖర్ రెడ్డి, రైతు, అల్లూరు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్డుల పంపిణీ



యూరియా విచ్చలవిడి వినియోగానికి అడ్డుకట్ట వేసి, రైతులకు నష్టం వాటిల్లకుండా చూసేందుకు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి సూచనల మేరకు యూరియా పంపిణీ కార్డులు అందజేస్తున్నాం. రైతులంతా మా కార్యాలయంలో సంప్రదించి, కార్డులు పొందాలి.

- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,860
వెండి కిలో ధర రూ. 1,54,000
వెండి ఒక గ్రాము రూ.160.00

అన్నప్రసాదానికి రూ.50,116 వితరణ

కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రతిఏటా మాలధారులకు నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమానికి గొల్లవెంకటరంగం, ధారావతి దంపతులు రూ.50,116 ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతిఏటా కార్తీకమాసం ప్రారంభం నుంచి జనవరి నెల ప్రారంభం వరకు మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గత 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి చేయూతనిచ్చిన గొల్ల వెంకటరంగం కుటుంబానికి అయ్యప్పస్వామి ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఉలవపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో లోతట్టు బాధిత ప్రజలకు ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో ఎలాంటి లోటులేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశంచారు. ఆదివారం మండలంలోని మన్నేటికోటలో నీట మునిగిన తిరుపతికుంట ఎస్టీ కాలనీ, వారికి కల్పించిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అధికారులు 4 రోజులుగా బాధితులకు ఏర్పాటు చేసిన సహాయక శిబిరంలోని ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు శిబిరంలో అన్నివేళల అందుబాటులో ఉండాలని, స్థానిక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో తుఫాన్ తీవ్రత, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన ముందస్తు భద్రత చర్యలపై సమీక్షించారు. జేసీ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఉలవపాడు:పునరావాస కేంద్రంలో జేసీ వెంకటేశ్వర్లు

● ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

కొండాపురం: మొంథా తుఫాన్ పట్ల ప్రతీ ఒక్క రూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సురేష్‌బాబు అన్నారు. ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, సాయిపేట దామా చినబాబా మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలను సిద్ధం చేశామన్నారు. వీఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ అనుదీప్‌కుమార్, వీఆర్‌వో శ్రీను తదితరులున్నారు.

● తుఫాన్‌పై జాగ్రత్తలు పాటించాలి

అల్లూరు : మొంథా తుఫాన్ హెచ్చరికలతో ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మృదులత, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన ఇస్కపల్లి తీర ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరదనీటితో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రాణ, మూగజీవాలు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పునరావాస కేంద్రాల ఏర్పాట్ల పరిశీలన

బిట్రగుంట: బోగోలు మండలంలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు పలుప్రాంతాలను మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. తిప్ప జాతీయ రహదారి సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, స్కిల్ డెవలప్‌మెంట్ భవనంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ రామకుమారి, వీఆర్వో ఉన్నారు.

న్యూస్ బాక్స్

వైసీపీ కోటి సంతకాల ఉద్యమ గోడపత్రిక ఆవిష్కరణ

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైన చర్యగా వైసీపీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ఆర్ ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన కోటి సంతకాల ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించి అందుకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రసాద్, జడ్పీటీసీ రాఘవులు, నేతలు కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, మద్దిబోయిన రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఐపీఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డిని కలిసిన విష్ణు

అల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఐపీఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డిని ఆదివారం నెల్లూరుకు రావడంతో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో కలసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, పవన్ కుమార్ రెడ్డి, బడబాగ్ని ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కలిగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మిక్కిలినేని గౌతమి జయంతిని పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆదివారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవా స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షిరిడీ శేష సాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్‌లోని షిరిడీ శేషసాయినాథుని మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం తొలి ఆదివారం సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తుల భజన కార్యక్రమాలు నిర్వహించారు. జంట నాగుల వద్ద ఉభయాలు అందచేశారు. వాకా మహేష్‌రెడ్డి, కల్యాణి దంపతులు అన్నసంతర్పణ చేశారు. మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న డాక్టర్ ప్రతిమ

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక వెంగళరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయంలో ఆదివారం డీఆర్ పేరుపై 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేల విలువ చేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ప్రతిమ వృద్ధులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ద్వారా 151వ నేత్రదానం



నాగరాజ్ కుమార్(ఫైల్)

కావలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన డాక్యుమెంటరీ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్ నాగరాజ్ కుమార్(60) అనారోగ్యంతో నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన నేత్రాలను సోదరుడు చలంచర్ల ఫణీంద్రకుమార్, సమీప బంధువు చలంచర్ల వెంకట కల్యాణ్ చక్రవర్తి ప్రేరణతో కావలి రెడ్‌క్రాస్ సహకారంతో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. కుమారుడు చలంచర్ల కార్తీక్ అంగీకారంతో ప్రభుత్వ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ కార్నియాలను సేకరించారు. కావలి రక్తదాన విభాగ కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి మాట్లాడుతూ ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 151వ నేత్రదానమని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు (ఎన్‌ఎంఎంఎస్) ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నమూనా పరీక్ష నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు, విశ్రాంత అధ్యాపకుడు ఎంవీఎన్ ప్రసాదరావు పర్యవేక్షణలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా సహకారంతో జరిగిన పరీక్షకు 189 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం డిసెంబరు 7వ తేదీన ఈ పరీక్ష నిర్వహించనుండడంతో ముందుగా నమూనా పరీక్ష నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వాసవీ వనిత లెజెండ్స్ సంబరాలు



ప్రమాణం చేయిస్తున్న బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి

కావలి(టౌన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయ మండపంలో ఆదివారం వాసవీ వనిత లెజెండ్స్ సంబరాలు ఘనంగా జరిగాయి. రీజియన్ చైర్‌పర్సన్ అనుమాలశెట్టి కామాక్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి పాల్గొని సేవా కార్యక్రమాలకు కట్టుబడి ఉంటామని సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం లక్ష్మీకుమారిని, కామాక్షిని, సెవెన్ లైన్స్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, వెంకటసత్యనారాయణ, పవన్‌కుమార్, సాయిరామ్ పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టుకు జల హారతి



రాళ్లపాడుకు జలహారతి ఇస్తున్న నేతలు

లింగసముద్రం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు సంఘ సభ్యులు, టీడీపీ నేతలు, అధికారులు గంగమ్మకు జలహారతి నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షులు ఉన్నం సుబ్బారావు, మాల్యాద్రి, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, డీఈఈ ఎం వెంకటేశ్వర్లు తదితరులు గంగమ్మకు పూజలు చేసి జలహారతి నిర్వహించి, చీర, సారె, పూలు పండ్లు సమర్పించారు. ప్రజలను, రైతులను చల్లగా చూడాలని, పాడి పంటలతో తులతూగేలా దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత అడపా రంగయ్య, ఏఈఈ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

● రాళ్లపాడును సందర్శించిన ఎస్పీ అజిత

ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు గురించి, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ గురించి డీఈఈ ఎం.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు వస్తే ప్రాజెక్టు నుంచి 1 లక్షా 20 వేల క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేయవచ్చని చెప్పారు. ఎస్పీ వెంట కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐలు అన్వర్ బాషా, మంగారావు, ఎస్ఐ ఎం.నారాయణ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌లో మెగా రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కావలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో కలాం ట్రస్ట్, సర్వ్‌విత్ లవ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 108 మంది యువకులు రక్తదానం చేశారు. కలాం ట్రస్ట్ అధ్యక్షుడు పేరూరి వెంకటసాయితేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రక్తదాతలకు కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డిలు ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



కందుకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని పామూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టౌన్ ఎస్ఐ శివనాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కందుకూరు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తి అయ్యి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై గేదెను ఢీకొన్న కారు

● త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీను

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణ శివారు ప్రాంతంలోని ఆదర్శ కాలనీ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గేదెను కారు ఢీకొనడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరుకు చెందిన షేక్ బాషిద్ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సీతారామపురం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ తరుణంలో ఆదర్శ కాలనీ వద్దకు రాగానే ఒక్కసారిగా మూడు గేదెలు రహదారిపైకి రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు ఒక గేదెను ఢీకొంది. ఈప్రమాదంలో గేదె మృతిచెందగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. వెనుకవైపు నుంచి వచ్చిన మరో కారు సైతం గేదెను ఢీకొంది. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అల శ్రీను తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో పొగలు

● అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్‌లో తాళాలు వేసిన ఓ ప్రొవిజన్స్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తరుణవాయి గ్రామానికి చెందిన ఓ యువకుడు సంగం బస్టాండ్‌లో ప్రొవిజన్ అండ్ ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా శనివారం రాత్రి దుకాణం మూసేసి తాళాలు వేసుకుని వెళ్లాడు. ఉదయం 6 గంటల సమయంలో దుకాణంలో నుంచి దట్టంగా పొగలు బయటకు రావడాన్ని స్థానికులు గమనించి యజమానికి సమాచారం అందించడంతో వెంటనే వచ్చి షట్టర్ తాళాలు తెరవగా విద్యుత్ మీటర్ షార్ట్‌సర్క్యూట్‌కు గురై మంటలు వ్యాపించి దుకాణమంతా పొగలు కమ్ముకున్నాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నష్టం తప్పింది. అయితే అప్పటికే కొన్ని సామాన్లు కాలిపోయాయి.

వీవోఏలపై వేధింపులు మానుకోవాలి : సీపీఎం

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య కోరారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నియోజకవర్గ స్థాయిలో వెలుగు వీవోఏలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వీవోఏల సంఘ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, షేక్ నాయబ్, కామాక్షమ్మ, చంటి, ప్రశాంతి, విజయ్, సరస్వతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జనసేన పార్టీ నాయకులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు చదలవాడ హరీష్ కుమార్ సహకారంతో బియ్యం, పప్పులు, చింతపండు, ఇతర సామగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో పొగలు

(5వ పేజీ తరువాయి)

బయలుదేరింది. ఈ బస్సు పొదలకూరు నుంచి మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న మర్రిపల్లి గ్రామం వద్దకు రాగానే బస్సులో నుంచి పొగలు, మాడిన వాసన వచ్చింది. దీంతో ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. దాంతో డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో వెంటనే ప్రయాణికులు తమ లగేజీలతో సహా కిందకు దిగారు. అనంతరం వారివారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు మోటారు బైకులపై వచ్చి వారిని వెనక్కు తీసుకెళ్లారు. బ్యాటరీ వైర్ల షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేసినా, ఆలస్యం కారణంగానూ, భయంతోనూ ప్రయాణికులు ఎవరూ ఎక్కలేదు. కాగా తాజాగా ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురవుతుండడంతో ఆందోళన చెందుతున్న ప్రయాణికులు స్లీపర్ కోచ్‌లో ప్రయాణమంటేనే హడలిపోతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● తుఫాన్ హెచ్చరికలపై అధికారులకు మంత్రి ఆనం దిశానిర్దేశం



తుఫాన్ హెచ్చరికలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఆయన సంగంలో పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రధానంగా పెన్నానది పరీవాహక మండలాలైన చేజర్ల, అనంతసాగరం, సంగం మండలాల గ్రామాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీరాపేరు, బొగ్గేరు, పెన్నానది సమీప మండలాల గ్రామాల్లోని సచివాలయాల్లో ముందస్తుగా రేషన్ సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో వీఆర్వోలు, పోలీసులు అందుబాటులో ఉండేవిధంగా బృందాలను ఏర్పాటు చేయాలని ఆర్డీవో, డీఎస్పీకి సూచించారు. రాకపోకలు స్తంభించే వీర్లగుడిపాడు గ్రామంపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నదీ తీరప్రాంతాల్లో బోట్లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో వైద్యులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసర మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా అన్ని చెరువులు, వాగుల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంగంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరాన్ని ఏర్పాటుచేసిన ఆత్మకూరు డివిజన్ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, సీఐ వేమారెడ్డి, గంగాధర్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసేవే కాకర్ల ట్రస్టు ధ్యేయం



గౌతమి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, టీడీపీ నాయకులు

ఉదయగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేయడమే కాకర్ల చారిటబుల్ ట్రస్టు ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో యూఎస్ఏ అట్లాంట వాస్తవ్యులు మిక్కిలినేని గౌతమి జయంతిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు, ట్రస్టు ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లోని బస్‌షెల్టర్ చుట్టూ ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాకర్ల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు బయ్యన్న, మధు, ప్రభాకర్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, ఉండేలా గురవారెడ్డి, నల్లిపోగు రాజా, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గేవరకు గ్రామస్థులెవరూ బయటకు రావొద్దు



సంగం బ్యారేజ్‌లో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

సంగం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావం తగ్గేవరకు గ్రామస్థులెవ్వరూ బయటకు రావద్దని ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని వరద తీవ్రత ప్రాంతాలను అధికారుల బృందం ఆదివారం సాయంత్రం పరిశీలించింది. ఆర్డీవో, డీఎస్పీ ఆధ్వర్యంలో అధికారుల బృందం సంగం బ్యారేజి, బీరాపేరు వాగు, కోలగట్ల, వీర్లగుడిపాడు వరద తీవ్రత ప్రాంతాలను పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ వినయ్‌తో వరద తీవ్రత, ఏర్పడే ఇబ్బందులపై చర్చించారు. అనంతరం బొగ్గేరు ప్రవాహంతో రాకపోకలు స్తంభించిన వీర్లగుడిపాడు గ్రామాన్ని అధికారుల బృందం సందర్శించింది. గ్రామానికి వెళ్లే మార్గంలో బొగ్గేరు కలుజు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆర్డీవో, డీఎస్పీ ట్రాక్టర్‌లో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ వరద ముప్పుతో భయపడవద్దని, ప్రభుత్వం తరపున అధికార యంత్రాంగమంతా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వారి వెంట తహసీల్దారు సోమ్లానాయక్, సీఐ వేమారెడ్డి, ఏఈ వినయ్, ఎస్ఐ రాజేష్, క్షేత్ర స్థాయి అధికారులు ఉన్నారు. కాగా, వరద పెరిగితే గ్రామానికి వెళ్లే అవకాశం ఉండదని మంత్రి ఆనం ఆదేశాలతో గ్రామానికి ముందస్తుగా ఉచిత బియ్యాన్ని లారీలో తరలించారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆత్మకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో బి పావని అధికారులకు సూచించారు. 24 గంటలూ తమ ప్రాంతాల్లో ఉండి ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించేందకు సిద్ధంగా ఉండాలన్నారు.

మునిసిపాలిటీ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా ఏవైనా సమస్యలు తలెత్తితే 08627-220385కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతారామపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోకల వారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు.

అంకలమ్మకు పొంగళ్లు



రౌద్దాలి అంకలమ్మకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

సీతారామపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక యోగానంద బాలాత్రిపుర సుందరిదేవి ఆశ్రమం సమీపంలో గ్రామ దేవత రౌద్దాలి అంకలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్త గంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న రోడ్డు పనులు

అనంతసాగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ ఎదురు వీధి, పూసల కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం కురిసినా నడవలేని పరిస్థితి నెల కొంది. ఇటీవల బురద మయంగా రహదారులు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు చదును చేసే పనులు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.